

ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆత్మకూరులో కొత్తగా నిర్మించిన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం. ఇందులో మూడు సూట్ రూమ్‌లు, ఒక గెస్ట్‌రూమ్‌తో పాటు కాన్ఫరెన్స్ హాలు ఉన్నాయి. పాత అతిథిగృహం పాడైపోయిందని, పుష్కరకాలం క్రితం అధికారులు నిర్ణయించడంతో కొత్త భవనం నిర్మాణానికి పునాదులు పడ్డాయి. 2012లో మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి రూ.50 లక్షలతో కొత్తదాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాని విలువ రూ.కోటికి పెరిగింది. 2017 నాటికి భవనం పూర్తయింది. చిన్నచిన్న పనులు పూర్తి చేసి ఫర్నీచర్ సమకూరిస్తే అతిథిగృహం అందుబాటులోకి వచ్చేది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఈ భవనం పూర్తి చేయడానికి మరో రూ.25 లక్షలు అవసరమవుతాయని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా అనుమతులు రాలేదు. 12 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఆర్‌అండ్‌బీ అతిథిగృహ నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆత్మకూరు పట్టణ పరిధిలోని నెల్లూరుపాలెం వద్ద నున్న పాత ఆర్‌అండ్‌బీ అతిథిగృహం (ఇన్‌స్పెక్షన్ బంగ్లా- ఐబీ). దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనంలో కేవలం ఒక సూట్‌రూమ్ మాత్రమే ఉంది. అందులోనూ ఇది పెంకులతో నిర్మించిన బంగ్లా. నేటి పరిస్థితులకు అనుకూలంగా లేకపోవడంతో కొత్త బంగ్లా నిర్మాణానికి 2012లో ప్రతిపాదనలు వెళ్లాయి. అందుకు అనుగుణంగానే ఆత్మకూరులో కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణం మొదలైంది. ఈ పాత గెస్ట్‌హౌస్‌ను ఎవరూ ఉపయోగించడం లేదు. ఇలాంటి బంగ్లాకు ఇప్పుడు సోకులు చేస్తున్నారు. అందుకు రూ.48.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అసలు ఈ బంగ్లా అవసరం లేదని కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణం జరుగుతున్నా.. ఇన్నెన్ని లక్షలతో పాత బంగ్లాకు మరమ్మతులు చేయడం వెనుకున్న ఉద్దేశం ఏమిటి..? అదే రూ.48.50 లక్షలను కొత్త గెస్ట్‌హౌస్‌కు మంజూరు చేసి ఉంటే అది ఎప్పుడో అందుబాటులోకి వచ్చి ఉండేది.

కొత్తది వద్దు...
పాతదే ముద్దు !

- ఆర్‌అండ్‌బీ అధికారుల వింత వైఖరి
- ఆత్మకూరులో పాత ఐబీకి సోకులు
- రూ.48.50 లక్షలతో సాగుతున్న పనులు
- పాత భవనం స్థానే కొత్త అతిథిగృహం నిర్మాణం
- ఏడేళ్లుగా ఆగిపోయినా పట్టించుకోని వైనం
- ఎవరి కోసం ఈ నిధుల దుర్వినియోగం..?

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కొత్తది వద్దు.. పాతదే ముద్దు.. అంటున్న ఆర్‌అండ్‌బీ అధికారుల వైఖరి మాత్రం వింతగా ఉంది. ఆత్మకూరులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ల విషయంలో అధికారుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నెల్లూరుపాలెం వద్ద ఎప్పుడో ఐదు దశాబ్దాల క్రితం పెంకులతో నిర్మించిన గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరుకుంది. కనీసం పదిమంది అధికారులతో కూడా ఈ భవనంలో సమావేశం నిర్వహించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో 2012లో ఆత్మకూరులో కొత్త ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. రూ.50 లక్షల అంచ నాతో మొదలైన పనులు చివరకు రూ.1.25 కోట్లకు చేరుకున్నాయి. దాదాపు రూ.కోటి పనులు చేశాక బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అయితే గత ప్రభుత్వంలో మరో రూ.25 లక్షలు ఇస్తే గెస్ట్‌హౌస్ పూర్తవుతుందని అధికారులు ప్రతిపాదనలు పంపినా అనుమతులు మంజూరు చేయలేదు. దీంతో ఏళ్ల గడిచిపోవడంతో కొత్త గెస్ట్‌హౌస్‌కు ఫర్నీచర్‌తోపాటు రిపేర్లు కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కొత్త గెస్ట్‌హౌస్‌ను పట్టించుకోని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ఉన్నతాధికారులు ఎన్నికలకు ముందు పనికిరాదనుకున్న పాత గెస్ట్‌హౌస్ మరమ్మతులకు రూ.48.50 లక్షలు మంజూరు చేశారు. రాష్ట్ర అధికా రులే ఈ నిర్ణయం తీసుకు న్నారా..? లేక జిల్లా అధికా రులు ప్రతిపాదనలు పంపారా..? అన్నది తేలాల్సి ఉంది. ఇవే నిధులు అప్పుడే కొత్త భవనానికి మంజూ రు చేసి ఉంటే ఈ పాటికి ఆ భవనం అందుబాటు లోకి వచ్చేది. ప్రస్తుతం పాత భవనంలో మరమ్మతు లు చేస్తుండడం గమనార్హం. కాగా ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొత్త గెస్ట్‌హౌస్‌ను సంద ర్శించారు. ఈ గెస్ట్‌హౌస్ ఆవశ్యకతను కలెక్టర్‌కు వివరించారు. దీంతో వెంటనే కలెక్టర్ తన నిధులు రూ.88.50 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచి ఉన్నారు. త్వరలోనే కొత్త భవనం కూడా పూర్తి కానుంది.

ఉన్నతాధికారులు అనుమతులిచ్చారు..

ఆత్మకూరులో పాత ఐబీ మరమ్మతులకు ఎన్నికలకు ముందు రాష్ట్ర ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేశారు. వారి ఆదేశాల మేరకు ప్రస్తుతం పనులు చేస్తున్నాం. కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తాజాగా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం టెండర్లు పిలిచి ఉన్నాం.

- గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ



మధ్యాహ్న భోజనం చేస్తూ విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

క్షేత్రస్థాయిలో విషయాలు తెలుసుకునేందుకు పర్యటన

- కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, జూలై 9 : అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించడంతోపాటు పలు విష యాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తొలుత వెంకటాచలం పంచాయతీ వడ్డీపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, చెముడుగుంట వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సైన్స్ మ్యూజియాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి రుచి చూశారు. అలాగే ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడి, ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థు లందరిని మ్యూజియానికి తీసుకొచ్చి వారికి సైన్స్‌పరమైన అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. వైద్య సేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డీఈవో రామారావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

క్వార్ట్జ్, సిలికా భోక్తలపై వేటు !?

- ఇప్పటికే నివేదికను అందచేసిన అధికారులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో వైసీపీ నేతల్లో వణుకు
- వందలాది కేసులు నమోదయ్యే అవకాశం



నెల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాపం పండుతోంది. అధికారమే అండగా సహజ వనరులను అడ్డంగా దోచుకుతిన్న వైసీపీ వర్గాలపై వేటుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంగా గత ఐదేళ్లలో సాగిన సిలికా, క్వార్ట్జ్ దోపిడీపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. అగ్రనాయకుల కోసం ఇష్టారాజ్యంగా సిలికా, క్వార్ట్జ్ క్వారీలపై పడి దోపిడీ చేసిన వందలాది మంది వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు చట్టపరమైన చర్యలకు సిద్ధపడాల్సిన సమయం ఆసన్నమయ్యింది. పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం ఈ కేసుల్లో బాధ్యులుగా చట్టం ముందు నిలబడాల్సి వస్తున్నది. సీఎం చంద్రబాబు నాయుడు త్వరలో గనుల శాఖలో జరిగిన దోపిడీపై విడుదల చేయబోయే శ్వేతపత్రంతో అక్రమార్కుల అరెస్టు పర్వం ప్రారంభం కానున్నది. జిల్లా అధికారులు ఇప్పటికే ఇచ్చిన నివేదిక ప్రకారం చిన్నాపెద్దా అంతా కలిపి సుమారు 200 మంది వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

● అక్రమ రవాణాలో అగ్రనేతల పేర్లు ?

చివరి ఏడాదిన్నరకాలం పాటు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ నిరాటంకంగా సాగిన విషయం తెలిసిందే. ఈ దోపిడీపై జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా నివేదిక పంపారు. ఇందులో సుమారు 200 మందికిపైగా వైసీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ దోపిడీలో వైసీపీ ముఖ్య నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలపై పెద్ద ఎత్తున ఆరోపణలు, అభియోగాలు వెల్లువెత్తాయి.సజ్జల సూచన మేరకు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ మొదలయ్యిందని, అధిష్ఠానం అనుమతితో అనిల్‌కుమార్ యాదవ్ దాన్ని గంపగుత్తగా కైవసం చేసుకున్నారని, సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి కాకాణి ప్రభుత్వ భూముల్లోని క్వార్ట్జ్ నిక్షేపాలను కొల్లగొట్టారని అప్పట్లోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. నిజమైన లీజుదారులను సైతం క్వారీల్లోకి రానీయకుండా దౌర్జన్యంగా క్వారీలను కైవసం చేసుకున్నారని, క్వార్ట్జ్ దోపిడీపై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల్లో కదలికవచ్చింది. ఆ క్రమంలోనే విచారణ జరిపి లక్షల టన్నుల క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిగాయని అధికారులు నివేదిక పంపారు. ఈ అక్రమ తవ్వకాల్లో వైసీపీకి చెందిన అగ్ర నాయకులతో పాటు 200 మంది ద్వితీయ శ్రేణి నాయకులు భాగస్వాములుగా ఉన్నారని నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ నివేదిక సీఎం చంద్రబాబుకు దృష్టికి వెళ్లింది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఐదేళ్లపాటు సాగిన సిలికా దోపిడీపై కూడా సీఎం దృష్టి సారించారు. గూడూరు డివిజన్ పరిధిలో 4500 ఎకరాల్లో సిలికా రీచ్‌లు ఉన్నాయి. 80 మంది లీజుదారులు ఉన్నారు. వైసీపీ నాయకులు ఈ లీజుదారందరిని నట్టేట ముంచారు. అధికార బలంతో వీరందరి లీజులను బలవతంగా స్వాధీనం చేసుకున్నారు. అది చాలదన్నట్లు సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న సిలికాను దోచుకున్నారు. ఐదేళ్ల పాటు అడ్డు అదుపు లేకుండా అధికారమే అండగా సాగిన ఈ దోపిడీపై కూడా చంద్రబాబు దృష్టి సారించారు. గూడూరు డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఈ కేసులో బాధ్యులుగా గుర్తించబడ్డారు. సోమవారం సీఎం చంద్రబాబు గనుల శాఖపై నిర్వహించిన సమీక్షలో నెల్లూరు జిల్లా కేంద్రంగా జరిగిన క్వార్ట్జ్, సిలికా దోపిడీపై సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు అక్రమార్కుల్లో వణుకు మొదలయ్యింది. అగ్రనాయకుల ప్రాపకం కోసం దగ్గరుండి కొండలు, గుట్టలు కొల్లగొట్టిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు అందుకు తగిన మూల్యం చెల్లించే సూచనలు కనిపిస్తు న్నాయి. ఈ కేసులో పలు వురు వైసీపీ అగ్రనాయకులు సైతం చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇరిగేషన్ ఎస్ఈలతో మంత్రి నిమ్మల సమీక్ష



ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సన్మానిస్తున్న జిల్లా ఎస్ఈలు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇరిగేషన్ పరిస్థితులపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్ఈలతో ఆయన సమావేశమయ్యారు. ఈ వారంలో నెల్లూరుకు రానున్న నేపథ్యంలో రెగ్యులర్ ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, టీజీపీ ఎస్ఈ రమణారెడ్డి, సోమశిల ఎస్ఈ రమణారెడ్డిలను సచివాలయానికి పిలిపించారు. ఆయా సర్కిళ్లలో జరుగుతున్న పనులు, ఆయకట్టుపై సమీక్షించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈలు మంత్రిని సన్మానించారు.

ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ బదిలీ

- కడా పీడీగా నియామకం



వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), జూలై 9 : నెల్లూరు నగర పాలక సంస్థ (ఎన్ఎంసీ) కమిషనర్ వికాస్‌మర్మత్ బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. ఏడాది క్రితం రాష్ట్ర సచివాల యాల విభాగం నుంచి ఎన్ఎంసీ కమిషనర్‌గా వచ్చిన ఆయన నెల్లూరులో పనిచేస్తూ బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఎన్ఎంసీ కమిషనర్‌గా ఎవరు వస్తారన్నది ఆసక్తిగా మారింది.

రేపు వెంగమాంబ పదహారు రోజుల ఉత్సవం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ పదహారు రోజుల ఉత్సవం గురువారం నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహారు రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం నిర్వహించడం సాంప్రదాయం. ఈ ఉత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ మంగళవారం తెలిపారు.



విద్యార్థులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి(ఫైల్)

ఇంజనీరింగ్ సీటే కీలకం !

- నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి
- కొనసాగుతున్న వెబ్ ఆప్షన్ల నమోదు
- జిల్లాలో 14 కళాశాలలు
- అందుబాటులో 11,574 సీట్లు
- 16న సీట్ల కేటాయింపు
- 19 నుంచి తరగతులు

నెల్లూరు (విద్య), జూలై 9 : ఇంజనీరింగ్ కావాలనుకునే విద్యార్థుల కల నెరవేరడానికి తొలిమెట్టు ఎక్కే ప్రక్రియకు రంగం సిద్ధమైంది. గతేడాది ఏ కళాశాలలో ఏ కేటగిరికి ఎన్నో ర్యాంకు వరకు సీటు వచ్చింది..? అనే వివరాలను పరిశీలిస్తూ.. తమకు సీటు ఎక్కడ వస్తుందోనని విద్యార్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు అత్యధికులు కంప్యూటర్ సైన్స్‌పైనే ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కౌన్సెలింగ్ కొనసాగుతుండగా, వెబ్ ఆప్షన్‌ల నమోదులో విద్యార్థులు బిజీగా ఉన్నారు.

● సగానికి తగ్గిన కళాశాలలు

గత పదేళ్లలో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలు దాదాపు సగానికి తగ్గిపో యాయి. గతంలో 21 కళాశాలలు ఉండగా, వీటిలో రెండేళ్ల క్రితమే మూడు కళాశాలల్లో ప్రవేశాల నిర్వహణ నిలిపివేశారు. తాజాగా మరో నాలుగు కళాశాలలు కూడా ప్రవేశాలు నిలిపివేశాయి. ఏఐసీటీఈ విడుదల చేసిన జాబితా ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలో 14 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రం అందుబాటులో ఉన్నాయి.

● అందుబాటులో 11,574 సీట్లు

జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 11,574 సీట్లు అందుబాటు లో ఉన్నాయి. వీటిలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు కళాశాల స్థితిగతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసుకుంటున్నారు. గతేడాది జిల్లాలో కొన్ని బ్రాంచ్‌లవైపు విద్యార్థులు మొగ్గు చూపారు. అత్యధికంగా సీఎస్ఈ, ఈసీఈ సీట్లు భర్తీకాగా మెకానికల్, సివిల్ విభాగాలకు రెండో ప్రాధాన్యం ఇచ్చారు. చివరగా ఈఈఈలో కొంత మంది మాత్రమే చేరారు. ఇంజనీ రింగ్‌లో బ్రాంచ్‌ల ఎంపికే కీలకమని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈఈఈ తో పాటు విద్యుత్, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్‌లు, బీఎస్ఎన్ఎల్ తదితర సంస్థల్లో అపార ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఎవర్‌గ్రీన్ బ్రాంచ్‌గా ఈసీఈని పిలుస్తారు. అంతరిక్ష, సమాచార సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు ఈ బ్రాంచ్ కీలకంగా మారడంతో అవకాశాలు అపారంగా ఉంటాయి. సీఎస్ఈ పూర్తిచేసిన వారికి ఇక తిరుగుండదు. శారీరక శ్రమకు వెనుకాడని వారికి మెకానికల్ మంచి విభాగమని నిపుణులు చెపుతున్నారు. నిర్మాణ రంగంలో రాణించాలంటే సివిల్ ఇంజనీరింగ్ మేలని చెబుతున్నారు. వీటన్నింటిని పరిశీలించి తమకు తగిన విధంగా విద్యార్థులు బ్రాంచ్‌లను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారం..

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ జరుగుతున్నట్లు జిల్లా సహాయ కేంద్రం, సమన్వయకర్త, ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్ తెలిపారు. ఒకటి నుంచి 10 వరకు కౌన్సెలింగ్ జరగ్గా, తాజాగా విద్యార్థులు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్ ఆప్షన్‌ల ఎంపిక చేసుకుంటున్నారన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు కనిష్ఠంగా రూ.4వేలు, గరిష్ఠంగా రూ.1.05లక్షలుగా ఉంది. ఈనెల 13వతేదీ వరకు వెబ్‌ఆప్షన్‌లు మార్చుకునే అవకాశం ఇచ్చారు. 16న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్ల కేటాయింపు జాబితా వెల్లడిస్తారు. సీట్లు దక్కించుకున్న విద్యార్థులు ఈనెల 17 నుంచి 22వతేదీ వరకు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. 19వతేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

కోవూరులో యువకుడి దారుణ హత్య

● పందుల పెంపకంలో వివాదం ● ఇరువురికి తీవ్ర గాయాలు



నాగరాజు మృతదేహం

కోవూరు, జూలై 9: పట్టణ పరిధిలోని రాళ్ళమిట్ట- దొమ్మరిమిట్ట సమీపంలో మంగళవారం పందుల పెంపకదారుల మధ్య ఏర్పడిన వివాదం ముదిరి ఓ యువకుడి హత్యకు దారితీయగా.. ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు అందిన సమాచారం ప్రకారం.. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీ ప్రాంతానికి చెందిన పెదాల నాగరాజుకు స్థానిక దొమ్మరపాళెం కాలనీకి చెందిన యువకుల మధ్య పందుల పెంపక విషయమై వివాదముంది. నాగరాజు తమ ప్రాంత పందుల్ని అపహరించి తీసుకువెళ్లాడని పలువురు యువకులు ఆయన్ను స్థానిక శివాజీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట నిలదీశారు. దీంతో రెండువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. వివాదాన్ని పరిష్కరించుకునేందుకు రెండు వర్గాల యువకులు కులపెద్ద వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలోనే రాళ్ళమిట్ట మీదుగా దొమ్మరపాళెం వెళ్తున్న నాగరాజును కొందరు యువకులు తరిమి కత్తులతో పొడిచారు. కత్తిపోట్లకు గురైన నాగరాజు (26) అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నాగరాజువర్గానికి చెందిన యువకులు దొమ్మరపాళెం ప్రాంతానికి చెందిన యువకులపై దాడికి దిగారు. ఘర్షణలో మన్నేపల్లి రామకృష్ణ, రాంబీ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో రాళ్ళమిట్ట ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, బాలాజీ నగర్ సీఐ వీరనాయక్, నెల్లూరు నగర 2టౌన్ సీఐ బాబీ, కోవూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని లాఠీఛార్జీ చేసి పరిస్థితిని అదుపులోనికి తీసుకువచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు నాగరాజుకు భార్య నలుగురు సంతానమున్నట్లు తెలిసింది. పందుల పెంపకదారుల ఘర్షణ, యువకుని హత్యతో వెంకటేశ్వరపురం, రాళ్ళమిట్ట, దొమ్మరపాళెం ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది.

ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పరిచయం

● యువకుడి కోసం ఇల్లు విడిచిన ఇద్దరు బాలికలు ● పాఠశాలకని వచ్చి అదృశ్యం

● పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు ● వారి చొరవతో క్షేమంగా ఇంటికి...

సంగం, జూలై 9: ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువకుడి మాయమాటలు నమ్మి ఇద్దరు బాలికలు ఇల్లు విడిచి 120 కిలోమీటర్ల దూరం వెళ్లారు. పాఠశాలకు వెళ్లిన బాలికలు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది విచారించారు. పాఠశాలకు రాలేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చొరవతో ఎట్టకేలకు ఇద్దరు బాలికలు క్షేమంగా ఇల్లు చేరారు.వివరాల్లోకి వెళితే.. పొదలకూరు మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు స్నేహితులు. వీరు సంగంలోని ఓ పాఠశాలలో ఒకరు పది, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలకని ఇంటి నుంచి వచ్చిన వారు అదృశ్యమయ్యారు. సాయంత్రం ఇంటికి రాకపోవడంలో వారి తల్లిదండ్రులు పాఠశాలలో విచారించారు. ఇద్దరు పాఠశాలలకు రాలేదని తేలింది. అయితే వారిలో ఓ బాలిక తనతల్లి ఫోన్‌ను వినియోగిస్తున్నది. అనుమానంతో ఫోన్‌ను పరిశీలించగా ఓ యువకుడితో ఇన్‌స్ట్రాగ్రామ్‌లో చాటింగ్ చేసినట్లు గుర్తించారు. ఆ ఫోన్ నెంబరుతో పోలీసులను సంప్రదించారు. వెంటనే పోలీసులు ఫోన్ సిగ్నల్‌ను కనిపెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. కడప జిల్లా సింహాద్రిపురం వద్ద సిగ్నల్ ఆచూకీ లభ్యమైయింది. ఆ యువకుడి పేరు శివప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. ఫోన్‌లో ఆ యువకుడితో మాట్లాడడంతో ఇద్దరు బాలికలు అక్కడికి చేరినట్లు నిర్ధారణ అయింది. వెంటనే సంగం పోలీసులు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడు ఇద్దరు బాలికలను సింహాద్రిపురం బస్టాండ్‌లోని ఓ కూరగాయల దుకాణం వద్ద వదిలేశాడు. సింహాద్రిపురం పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు సోమవారం అర్ధరాత్రి సింహాద్రిపురం బయలుదేరి వెళ్లారు. ఎట్టకేలకు పోలీసుల చొరవతో ఇద్దరు బాలికలు క్షేమంగా ఇంటికి చేరారు. కాగా బాలికలను మాయలో పడేసిన ఆ యువకుడు పరారీలో ఉన్నాడు. ఆ యువకుడికి గతంలోనే వివాహమై భార్యతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా విడిపోయినట్లు విశ్వసనీయ సమాచారం.

దుర్గంపల్లిలో కొండచిలువ సంచారం



దుర్గంపల్లి సమీపంలో సంచరిస్తున్న కొండచిలువ

ఉదయగిరి రూరల్, జూలై 9: మండలంలోని దుర్గంపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండచిలువ హల్‌చల్ చేస్తుండడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి దగ్గరలో ఉన్న కోనేరు వద్ద కొండచిలువ సంచరిస్తూ ఓ మేకపిల్లను పట్టుకొంది. మేకపిల్ల అరుపులు విన్న సమీపంలోని యువకులు అక్కడికి చేరుకొని కొండచిలువ బారి నుంచి మేకపిల్లను రక్షించారు. దీంతో జీవాల యజమానులు, ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు భయపడుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూలై 9: నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని వందన లాడ్జి ఎదురుగా సిక్కిందర్ టీ స్టాల్ పక్కన ఐవోబి ఏటీఎం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ వీవీ నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లభ్యమైనా లైసెన్సుకు మృతి చెందిన వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని పోలీసులు తేల్చారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేస్తున్నారు. మృతుడును గుర్తించిన వారు వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి...



మృతి చెందిన హనుమంతు

విడవలూరు, జూలై 9: మండలంలోని తేటదిబ్బకు సమీపంలోని రొయ్యలగుంటలకు వేసిన విద్యుత్ తీగలు తగిలి షాక్ తగలడంతో ఊటుకూరు గ్రామానికి చెందిన హనుమంతు మరణించాడు. స్థానికులు, పోలీసుల తెపిన మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రమీలమ్మ కుమారుడైన ఈయన జీవనోపాధి నిమిత్తం ఒంగోలు పనిచేసుకునేవాడు. అప్పుడప్పుడు ఇంటికి వచ్చి తల్లిదండ్రులను పలకరించి వెళ్లేవాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని రొయ్యలగుంటల్లోని రొయ్యలు దొంగతనం చేయడానికి అర్ధరాత్రి వెళ్లాడు. రొయ్యలను దొంగ చేసే క్రమంలో విద్యుత్ 11కేవీ వైరు కాలికి తగలడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు స్థానిక ఎస్ఐ రాజా, వీఆర్వో భాస్కర్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బుచ్చిరెడ్డిపాలెంలో రెండిళ్లలో చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 9: పట్టణంలోని రామకృష్ణానగర్, కాశీపాళెంలోని రెండిళ్లలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం పక్కింటి వారు గుర్తించిన ఇళ్ల యజమానులు, బంధువులకు సమాచారమిచ్చారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీంతో వేలిముద్రలు ఇతర వివరాలు సేకరించారు. ఇళ్లలో ఎవరూ లేకుండా వుండడాన్ని గుర్తించి దొంగలు ఈ చోరీలకు పాల్పడినట్లు చెబుతున్నారు. బంధువులు, పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిలోని రామకృష్ణానగర్‌లో ఉంటున్న పత్రి మహేష్, సుజాత దంతపతులు రామచంద్రామిషన్‌లో పనినిమిత్తం 20రోజుల కిందట హైదరాబాదుకు వెళ్లారు. ఎదురింటి మహిళకు ఆ ఇంట్లోని దోశపిండి మిల్లు తాళాలు ఇచ్చి వెళ్లడంతో ఆమె నిత్యం ఆ ఇంటిముందు నీరు చిమ్మి ముగ్గులు వేసేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ముగ్గులు వేసే క్రమంలో చూడగా ఇంటి తలుపులకు తాళాలు పగలగొట్టి వుండడాన్ని గుర్తించి మహేస్ బంధువు ప్రభాకర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి మహేష్ కుమారుడు హైదరాబాదు నుంచి వస్తున్నట్లు తెలిపారు. ఆయన వస్తేనే ఆ ఇంట్లో ఏమేమి చేరీ గురయ్యాయనేది తెలియాల్సి వుంది. అలాగే కాశీపాళెంలోని చోరీ జరిగిన ఇంటికి చెందిన యజమాని లక్ష్మీనరసింహాలు కుంటుంబం తిరుపతికి వెళ్లింది. చోరీ జరిగిన విషయాన్ని పక్కింటివాళ్ల సమాచారం ఇచ్చారు. బుచ్చిలో వున్న యజమాని కొడుకు మనోజ్‌కు ఇంటిలో పరిశీలించి రూ.5వేలు చోరీకి గురైనట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా బుచ్చిలో జరుగుతున్న వరుస చోరీలకు తోడు ఇటీవల బ్రాహ్మణవీధిలో ఉపాధ్యాయుడు వెంగళరావు నివాసంలో 50సవర్ల బంగారు, రూ.4లక్షల నగదు చోరీ ఘటన మరువక ముందే ఈ చోరీలు జరగడంతో స్థానిక ప్రజలను భయాందోళనకు గురిఅవుతున్నారు. పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టి బుచ్చిలో చోరీలకు కళ్లెం వేయాల్సి వుందని కోరుతున్నారు.అలాగే రాత్రిళ్ల గస్తీలు తిరగాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	134
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	268
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6917
వెండి కిలో ధర	రూ. 94,500
వెండి ఒక గ్రాము	రూ. 96.50

మహిళా మార్టుల్లో అవినీతి అనకొండలు

● పొదుపు మహిళల పెట్టుబడి సొమ్ము స్వాహా ● లబోదిబోమంటున్న బాధితులు

● పైగా నాసిరకం సరుకుల విక్రయం ● నేడు వింజమూరు మార్టును పరిశీలించనున్న సెర్ప్ ఏడీ

నెల్లూరు(హరనాథపురం), జూలై 9: పొదుపు మహిళల అర్థిక అభివృద్ధితోపాటు వారు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవడానికి, మేలైన సరుకులు ప్రజలకు అందించటానికి ఏర్పాటు చేసిన మహిళా మార్టులు అవినీతికి అనకొండలకు నిలయాలుగా మారాయి. వాటి నిర్వహణ చూసే వారే అందులో నగదును స్వాహా చేస్తూ, పెట్టుబడి పెట్టిన పొదుపు సంఘాల మహిళలకు మొండిచేయి చూపిస్తున్నారు. అంతేకాక అక్కడ నాసిరకం సరుకులు పంపిణీ చేస్తూ ప్రజలను కూడా మోసం చేస్తున్నారు.

● వాటాదారులుగా స్వయం సహాయక సభ్యులు

స్వయం సహాయక సంఘాల సభ్యులే మహిళా మార్టుల్లో వాటాదారులుగా ఉంటారు. వారు ఒక్కొక్కరు రూ. 150 నుంచి రూ. 200 వరకు పెట్టుబడి పెట్టారు. ఈ మార్టులకు మహిళలే అధ్యక్షులుగా, కార్యదర్శిగా, ట్రెజరర్‌లుగా ఉంటారు. సంవత్సరానికి వచ్చే ఆదాయం, ఖర్చులు చూసుకొని, లాభాలను పెట్టుబడి పెట్టిన మహిళలంతా పంచుకుంటారు. సరుకుల కొనుగోలు దగ్గర నుంచి నిర్వహణ వరకు వారే చూసుకోవాల్సి ఉంటుంది. పొదుపు గ్రూపుల్లో ఉండే మహిళలతోపాటు, ఇతరులు కూడా ఈ మార్టుల్లో కొనుగోలు చేయవచ్చు. ముఖ్యంగా పొదుపు సంఘాల మహిళలు తమ ఇంటికి కావాల్సిన సరుకులు డిస్కౌంట్‌తో పొందవచ్చు. కాని జిల్లాలో ఎక్కడా అలా జరగటం లేదు.

● డీఆర్‌డీఏ పరిధిలో రెండు ఏర్పాటు

జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) పరిధిలో మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వింజమూరు, కందుకూరుల్లో వీటిని ఏర్పాటు చేశారు. వింజమూరులో దీని పర్యవేక్షణ చూసే ఏపీఎం మార్టుకు సంబంధించిన నగదు స్వాహాచేశారని, నాసిరకం వస్తువులను మార్టులో అమ్మించారని, నూనెలను సైతం అధిక ధరలకు విక్రయించి, ఏకంగా మార్టును ముంచేశారని పొదుపు సంఘాల మహిళలు నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారి ఆందోళనతో డీఆర్‌డీఏ పీడీ, వింజమూరు ఏపీఎంను సస్పెండ్ చేశారు. ఆమెపై ఇంకా విచారణ సాగుతోంది.



నెల్లూరు డైకస్‌రోడ్డులోని మహిళా మార్టు

● మెప్మా పరిధిలోని వాటిలో నిధుల దుర్వినియోగం

మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని డైకస్ రోడ్డు సెంటర్, కావలిలో వీటిని ఏర్పాటు చేశారు. తాజాగా నగరంలోని డైకస్‌రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహిళా మార్టులో నిధులు స్వాహా, దుర్వినియోగం జరిగిందని పొదుపు మహిళలు సోమవారం బాహాబాహీకి దిగారు. పొదుపు గ్రూపుల నుంచి మహిళా మార్టు ఏర్పాటు కోసం వసూలు చేసిన రూ.16లక్షల్లో ఎంత ఖర్చు చేశారనే అంశమై పొదుపు మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. మహిళా మార్టు పేరుతో వసూలు చేసిన నగదును గతంలో అధికారంలో ఉన్న వైసీపీ కార్యక్రమాలకు ఖర్చుచేశారని పొదుపు మహిళలు ఆరోపించారు. మార్టు కోసం వసూలు చేసిన డబ్బులో ఎంత ఖర్చుచేశారో సమాధానం చెప్పాలని పొదుపు మహిళలు ప్రశ్నించారు, దీంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. ఈ సమావేశంలో టీఎల్‌ఎఫ్ వారు సమాధానం ఇస్తూ మహిళా మార్టు ద్వారా రూ. 8.5లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పినట్లు తెలిసింది. ఆ టీఎల్‌ఎఫ్‌ల పరిధిలోని ఒక్కొక్క పొదుపు గ్రూపు నుంచి సుమారు రూ.1500 వంతున, రూ.16లక్షలు వసూలు చేసి, మహిళా మార్టును ఎన్నికలకు ముందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 9 టీఎల్‌ఎఫ్‌లు ఉంటే, కేవలం టీఎల్‌ఎఫ్-1, 5లు మహిళామార్టు ఏర్పాటు చేశారు. మిగిలిన వారు ఏర్పాటు చేయలేదు. కాగా డైకస్‌రోడ్డులోని టీఎల్‌ఎఫ్-1, 5 అధ్యక్షురాళ్లపై నగ రంలోని ఐదో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

● సెర్ప్ ఏడీ నేడు వింజమూరు మార్టు పరిశీలన

వింజమూరులోని మహిళా మార్టును సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత బుధవారం పరిశీలించనున్నారు. పొదుపు మహిళలు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. మహితతోపాటు డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, ఇతర అధికారులు కూడా పరిశీలనలో పాల్గొనున్నారు.

ఉచిత ఇసుక పాలసీ పేదల కోసమే..!

● జగన్ పాలనలో కష్టాలు పడ్డ కార్మికులు ● టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అజీజ్



మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

నెల్లూరు(వైద్యం), జూలై 9 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేసిన ఉచిత ఇసుక పాలసీ పేదల కోసమేనని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పేదలు ఇల్లు నిర్మించుకోవాలంటే అయ్యే రూ. 10 లక్షల ఖర్చులో రెండు రూ.లక్షల ఒక్క ఇసుకకే ఖర్చు చేయాల్సి వచ్చేందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసిని తీసుకు వచ్చి పేదింటి కలలను నెరవేరుస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వేలమంది భవన నిర్మాణ కార్మికులు కష్టాలు పడ్డారని విమర్శించారు. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులకు మంచి ఉపాధి దొరుకుతుందని చెప్పారు. దీంతో పేద, బడుగు వర్గాలు హర్షిస్తున్నాయని వెల్లడించారు. వైసీపీ పాలనలో రూ.5వేల అయ్యే ట్రాక్టర్ ఇసుక నేడు ఉచితంగా లభిస్తుందన్నారు. నెల్లూరు రూరల్‌లోని గొల్లకందుకూరు ఇసుక రీచ్‌లో 50వేల క్యూబిక్ మీటర్ల ఇసుకకు అనుమతులు ఉండగా 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తరలించారని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో ఇసుకలో రూ. 50వేల కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. సుప్రీం కోర్టు, హైకోర్టు ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుక పాలసీని చంద్రబాబు అందిస్తున్నారని తెలిపారు. అయితే ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు.

పులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● గుంటూరు రేంజ్ సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న గుంటూరు రేంజ్ సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 9 : జిల్లాలో రెండు పెద్దపులులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజ్ సీసీఎఫ్ వై.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. నగరంలోని నిప్పో పరిశ్రమ సమీపంలో ఉన్న జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆయన జిల్లా అటవీ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్ కారిడార్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో జిల్లాలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఆయా ప్రాంతాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. టైగర్ హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు ఒంటరిగా ఎవ్వరినీ అడవుల్లోకి అనుమతించవద్దని సూచించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న నగరవనాల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎర్రచందనం అక్రమరవాణా, దానికి సంబంధించిన పెండింగ్ కేసులు, పట్టుబడ్డ వాహనాలు తదితర వివరాలపై సమీక్షించారు. వీటితో పాటు ఇటీవల జిల్లా వ్యాప్తంగా జరిగిన జామాయిల్ తోటల వేలం పాటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతీ ప్రసాద్, రేంజర్‌లు మాల్యాద్రి, రవీంద్రబాబు, డీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

చేపల అక్రమ వేట.. 20 మందిపై కేసు నమోదు

కలువాయి, జూలై 9 : కలువాయి చెరువులో అక్రమ చేపల వేటపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మత్స్య సొసైటీ పాలకవర్గ సభ్యులతో పాటు మొత్తం 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అయ్యప్ప తెలిపారు. వివరాల మేరకు గత ప్రభుత్వం చేపల పెంపకంతో ఆదాయం గడించాలని జిల్లాలోని 27 చెరువులను పైలెట్ ప్రాజెక్టు కింద చేర్చింది. ఇందు కోసం టెండర్లు కూడా పిలిచింది. ఈ జాబితాలో కలువాయి చెరువు కూడా ఉంది. దీంతో మత్స్య సొసైటీకి చెరువును లీజుకు ఇవ్వకుండా నిలిపి వేసింది. ఈ నేపథ్యంలో ఫిషర్‌మెన్ సొసైటీకి చెరువుపై ఎలాంటి అధికారం లేకపోయినా రాత్రి సమయంలో దొంగతనంగా చేపలు పట్టి అమ్ముకున్నారని సొసైటీ మాజీ అధ్యక్షులు వజ్రాల శ్రీనివాసులు, కొంత మంది సభ్యులు కలిసి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ద్వారా మత్స్యశాఖ జేడీకి ఫిర్యాదు చేశారు. దీంతో చెరువులో అక్రమ చేపల వేటపై విచారణ చేపట్టాలని కావలి మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులును జేడీ ఆదేశించారు. ఈనెల 3వతేదీ కావలి ఏడీ శ్రీనివాసలు కలువాయికి వచ్చి పలువురు మత్స్యకారులను విచారించారు. వారి వద్ద నుంచి రాత పూర్వకమైన స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా అదే రోజు మత్స్యశాక ఏడీ కలువాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అయ్యప్ప తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పొదలకూరు, జూలై 9 : పట్టణంలోని సాయిబాబా ఎరువుల దుకాణాన్ని మంగళవారం వ్యవసాయ, విజిలెన్స్ శాఖ సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీ చేశాయి. షాపుల్లోని పలు రిజిస్టర్‌లను పరిశీలించాయి. అనంతరం అధికారులు మాట్లాడుతూ రూ.4,19,750 విలువైన ఎరువులకు సరైన పత్రాలు లేకపోవడంతో అమ్మకాలు నిలిపివేశామని, అలాగే రూ.76,200 విలువైన పురుగు మందుల అమ్మకాలను కూడా నిలిపివేశామన్నారు. ఇందుకు సంబంధించిన సరైన పత్రాలను ఉన్నతాధికారులకు చూపించిన తర్వాత వాటిని అమ్ముకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టామన్నారు. మందుల దుకాణాల్లో ఏవైనా కొన్నప్పుడు బిల్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు ఏడీఏ ఈవీ రమణ, పొదలకూరు ఏడీఏ శివనాయక్, నెల్లూరు ఏడీఏ నర్సోజీరావు, నెల్లూరు విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది మస్తాన్ పాల్గొన్నారు.

పెన్నానదిలో దూకి యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 9: బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగుకు చెందిన శ్రీనివాసులు(40) ఆర్థిక ఇబ్బందులతో పెన్నానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. దామరమడుగుకు చెందిన ఎస్ నిర్మలమ్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు శ్రీనివాసులు నగరంలోని ఎలక్ట్రీషన్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం ఆయనకు నారాయణరెడ్డిపేటకు చెందిన ఓ యువతితో వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో రెండు నెలలకే భార్య అతనిని విడిచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసైన శ్రీనివాసులు తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తిరిగి చెల్లించలేక, అప్పులిచ్చిన వారి ఒత్తిడితో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం పని ఉందని తల్లికి చెప్పి నెల్లూరుకు వచ్చాడు. ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం పెన్నానదిలో శవమై తేలాడు. నదిలో నీటిపై మృతదేహం తేలియాడుతుండటంతో గమనించిన స్థానికులు డయల్ 112కు సమాచారం అందించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ ఏ సుబ్బరాజు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతిచెందిన కొద్ది దూరంలో గోడపై మృతుడి చొక్కా, మెడలో ధరించే కాశీధారం, టెస్టర్ ఉంది. గోడపై ఫోన్ నెంబరు రాసి ఉండడంతో. ఆ నెంబరుకు పోలీసులు ఫోన్ చేయగా మృతుడు తల్లి నిర్మలమ్మ మాట్లాడింది. దీంతో పోలీసులు జరిగిన విషయాన్ని ఆమెకు తెలిపారు. ఆమె హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కుమారుడు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. ఆర్థిక ఇబ్బందులతోనే శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఈవో కార్యాలయానికి చేరిన డిక్షనరీలు

నెల్లూరు(విద్య) : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే స్టూడెంట్స్ కిట్స్‌లోని డిక్షనరీలు మంగళవారం జిల్లాకు చేరాయి. డీఈవో కార్యాలయ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకుని కార్యాలయంలో భద్రపరిచారు. అక్కడ నుంచి ఈ డిక్షనరీలను మండల కేంద్రాల ద్వారా విద్యార్థులకు అందచేయనున్నారు

12న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 9: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం విజయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్‌లో 15 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేటలో పనిచేసేందుకు 30 ఏళ్ల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 20 పోస్టులకు, ఆదిత్య జిల్లా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 100 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని డిగ్రీ విద్యార్హత కలిగి 32 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. సంగీత మొబైల్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ తదితర 10 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని ఆసక్తి కలిగిన యువత ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

బోగోలు బజారులో దొంగల హల్‌చల్

● నాలుగు ఏటీఎంలలో చోరీకి యత్నం



దుండగులు ధ్వంసం చేసిన షట్టర్

బిట్రగుంట, జూలై 9: స్థానిక మేజర్ పంచాయతీలో దొంగలు మంగళవారం తెల్లవారు జామున హల్‌చల్ చేశారు. బోగోలు రైల్వే ఎల్సీ గేట్ 144కు పడమర వైపు ఉన్న నాలుగు దుకాణాలతో పాటు ఏటీఎంలో చోరీ చేసేందుకు ప్రయత్నించి విఫలమైయ్యారు. మొబైల్ షాపు షటర్ ఒకవైపు తాళం విరగొట్టి మరోవైపు రాకపోవడంతో వదిలేసి వెళ్లిపోయారు. పక్కనే ఉన్న కూల్‌డ్రింగ్స్ షాపులో అదే విధంగా చోరీకి యత్నం చేశారు. ఏటీఎంలో భారీగా నగదు ఉంటుందని రెండువైపులా షటర్ తాళాలు విరుగొట్టారు. లోపలికి చూసే సరికి ఏటీఎం మిషన్‌లో నగదు లేకపోవడంతో దొంగలు వెనుదిరిగారు. పక్కనే ఉన్న లక్ష్మీ స్వీట్ షాపులోని గల్లాపెట్టెలోని రూ.3వేలను తీసుకెళ్లినట్లు యజమాని తెలిపారు. రైలు ట్రాక్ సమీపంలోని టీ షాపు షటర్ తాళాలు విరుగ కొట్టారు. ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ సంఘటనా స్థలాలను పరిశీలించారు. ఐతే చోరీ యత్నాలపై స్థానిక పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని వారు చెబుతున్నారు.

రేపటి నుంచి పాలిటెక్నిక్ తుది కౌన్సెలింగ్

నెల్లూరు(విద్య), జూలై 9 : పాలిటెక్నిక్‌లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు తుది కౌన్సెలింగ్ నిర్వహణకు షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఈనెల 11 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. క్వాలిఫైడ్ అభ్యర్థులకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించి పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఫేజ్-1 కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అర్హత కలిగిన అభ్యర్థులు తమ పాత పాస్‌వర్డ్‌తో మిగిలి ఉన్న సీట్ల కోసం కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. తొలిదశలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులు ఈ చివరి దశలో ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి కళాశాలలను, కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. దీనిలో భాగంగా జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు కౌన్సెలింగ్‌లో సందేహాలుంటే నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జరిగిన అర్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వచ్చిన ర్యాంకుల ప్రకారం వివిధ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నారు. పాలిసెట్ అడ్మిషన్లకు సంబంధించి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఆన్‌లైన్ పేమెంట్ ప్రక్రియ ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులకు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు 1 నుంచి చివరి ర్యాంక్ వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలి. అనంతరం 14వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక, 16న సీట్ల కేటాయిస్తారు. 18 నుంచి 20వ తేదీ వరకు అభ్యర్థులకు కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు కౌన్సెలింగ్ ఫీజు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. విద్యార్థులకు ఏదైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ కేంద్రంలో సంప్రదించాలని జిల్లా సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్ తెలిపారు.

సోమశిలలో 9.980 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 9: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి డ్యాంలో 9.980 టీంఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 202 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 600, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నూరు శాతం బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ఉదయగిరి, జూలై 9: మండలంలోని 12 సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి నూరు శాతం బయోమెట్రిక్ హాజరు తప్పనిసరని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 10గంటల్లోపు విధులకు హాజరు కావాలని, సాయంత్రం 5 గంటల తరువాత బయోమెట్రిక్ హాజరు వేయాలని, నిబంధనలు అతి క్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.













ఎస్టీ కమిషన్‌ను కదిలించిన న్యాయవాది

- ఆంధ్రజ్యోతి కథనంతో ఎస్టీ కాలనీ వాసుల హర్షం
- అట్టల ఫ్యాక్టరీని పరిశీలించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి

కావలి రూరల్, జూలై 9: ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 16వ తేదీన ప్రచురితమైన గిరిజనులకు పొంచి ఉన్న ముప్పు కథనానికి న్యూఢిల్లీ జాతీయ ఎస్టీ కమిషన్ స్పందించింది. వారి ఆదేశాల మేరకు మంగళవారం పొల్యూషన్ కంట్రోల్ నెల్లూరు రీజనల్ అధికారి సిహెచ్ రాజశేఖర్ ముసునూరులోని అట్టల ఫ్యాక్టరీ పరిసరాలను పరిశీలించారు. కావలి చేరిన పొల్యూషన్ రిజనల్ అధికారి రాజశేఖర్ అట్టల ఫ్యాక్టరీ పరిసరాలు పరిశీలించి స్థానిక గిరిజనుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ పరిసరాల్లో రోడ్ల పై ఉన్న వ్యర్థాలను 15 రోజుల్లో గా తొలగించాలని నోటీసులు జారీ చేస్తాం. అనంతరం ఫ్యాక్టరీని విజిట్ చేసి రికార్డులు పరిశీలించి అవకతవకలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ కాలనీలోని గిరిజన కాలనీకి సమీపంలో ఉన్న అట్టలఫ్యాక్టరీ వ్యరాలు ఏళ్ల తరబడి రోడ్లపై నిల్వ చేయడంతో విషపురుగుల సంచారం ఎక్కువైందని అధికారులు పట్టించుకోవటం లేదన్న కథనాన్ని నెల్లూరుకు చెందిన న్యాయవాది పాముల హరిప్రసాద్ గుర్తించారు. గిరిజనుల పట్ల ఔదార్యం ప్రదర్శించిన హరిప్రసాద్ ఈ విషయాన్ని న్యూ ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కావలి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.


అట్టల ఫ్యాక్టరీ పరిసరాలలో రోడ్డుపై ఉన్న వ్యర్థాలు

వెలిగండ్లలో జనసేన జెండా ఆవిష్కరణ

కొండాపురం, జూలై 9: వెలిగండ్లలో మంగళవారం జనసేన నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండలంలో పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి జనసేన కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు , ప్రధాన కార్యదర్శి కుప్పాల శ్రీనివాసులు కోరారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేకు కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు గుంటుపల్లి సుధాకర్ , అరిగెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు..

చిన్నపాటి వర్షానికి మురుగుమయంగా సిమెంటు రోడ్లు

కొండాపురం, జూలై 9: చిన్నపాటి వర్షాలకే నేకునాంపేట పంచాయతీలోని తూర్పుపాలెం రామాలయం వద్ద సిమెంటు రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తోంది. ఈ నీరు ఎటూ పోయేందుకుకు వీలులేక రెండు, మూడు రోజులపాటు నిలు స్తుండంతో మురుగుగా మారి దుర్గంధం వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డు వేసినప్పటి నుంచి పరిస్థితి ఇలాగే ఉన్నా పాలకులు, పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రామాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

పంచాయతీకి నేతల ఫొటోలు

బిట్రగుంట, జూలై 9: బోగోలు పంచాయతీ కార్యాలయానికి మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చిత్ర పటాలను మంళవారం కార్యదర్శి జహీర్ భాషాకు అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు అరుణమ్మ తదితరులు ఉన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధికి పురందేశ్వరికి వినతి

కావలి టౌన్, జూలై 9: రాజమండ్రిలో జరుగుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బీజేపీ నేతలు బ్రహ్మానందం, శ్రీనివాసులు, పరుసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధిని కోరుతూ నియోజకవర్గ బీజేపీ నేతలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగుబాటి పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

కావలి జెండాచెట్టు చావిడిలో పీర్ల ప్రార్థనలు

కావలి టౌన్, జూలై 9: పట్టణంలో జెండాచెట్టు పీర్ల చావిడిలో పీర్లను ప్రతిష్టించి ప్రార్థనలు నిర్వహించారు. జెడ్డాచెట్టు నాగూర్ మీరా స్వాముల దర్గా కమిటీ అధ్యక్షులు ముస్తఫా పర్యవేక్షణలో జరుగుతున్న పీర్ల వేడుకలు ఈనెల 17వరకు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఖాదర్‌బాష, నాయబ్, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

కావలిలో విద్యార్థుల శోభాయాత్ర

కావలి, జూలై9: ఏబీవీపీ వ్యవస్థాపకదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు. అనంతరం చత్రపతిశివాజీ విగ్రహం వద్ద జండా ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో నగరకార్యదర్శి మనువర్ధన్, జిల్లా టెక్నికల్ కన్వీనర్ ఎస్. వినయ్, కావలిబాగ్ కన్వీనర్ ఎస్ త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంట పోరంబోకు భూమి పరిశీలన


మద్దూరుపాడు రోడ్డులో ఆక్రమణకు గురైన గుంట పోరంబోకు వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్ తదితరులు

కావలి, జూలై 9: పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కింద మద్దూరుపాడు వెళ్లే మార్గంలో 656 సర్వేనంబరులోని 4.70 ఎకరాలు గుంట పోరంబోకు భూమిని మంగళవారం కావలి ఆర్డీవో శీనానాయక్, తహసీల్దార్ నగేష్, వీఆర్వో పద్మలు పరిశీలించారు. ఈ భూమి ఆర్ఎస్సార్‌ద్వారా రెవెన్యూ రికార్డులు చూపిస్తున్నాయని చెప్పారు. ఈ భూమిలో 6గురికి పట్టాలు ఇచ్చినట్లుగా రికార్డులు సృష్టించారని గుర్తించారు. అధికారులు తనిఖీ చేయటానికి వస్తున్నారని తెలిసి రాత్రికి రాత్రి ఆ భూమిలో కొంత భాగం దున్ని వ్యవసాయ భూమిగా చూపించే ప్రయత్నం చేపట్టారు. గుంట పోరంబోకును లేఅవుట్ వేసినట్లు అక్కడ ఆనమాలను బట్టి గుర్తించారు. మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

117వ జీవోను రద్దు చేసి ప్రభుత్వ బడులను కాపాడాలి


డిప్యూటీ ఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీటీఏ నాయకులు

ఆత్మకూరు, జూలై 9 : 117వ జీవోను రద్దు చేసి ప్రభుత్వ బడులను పరిరక్షించాలని బీటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కరటం పాడు, పేరారెడ్డిపల్లి, ప్రభుత్వ బాలకోన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధి లోని పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీటీఏ పనిచేస్తుందన్నారు. అనంతరం ఉపవిద్యాశాఖాధికారి కే గోపాల్‌ను కలిసి విద్యారంగ సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షులు మణి సుబ్బు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రొట్టె వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జే.కొండయ్య, డాక్టర్ ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు, జూలై 9: విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 1949లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆవిర్భవించిందని ఏబీవీపీ నగర అధ్యక్షులు దారా వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం పట్టణంలో 76వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని లక్షలాది విద్యా ర్థుల్లో జాతీయభావాలను, సేవభావాలను నింపుతూ విద్యార్థుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏబీవీపీ ఆవిర్భావం చారిత్రక అవసరంగా ఏర్పడిందన్నారు. జ్ఞానం, శీలం, ఏకత అంటూ సమాజంలోని అసమానతలు తొలగించి దేశం జగత్ గురువుగా నిల పడం కోసం ఏబీవీపీ 76 ఏళ్లుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మధు, భరణి, మౌలేష్, రామ్‌చరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం, జూలై 9 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. సీతారామపురంలోని ఆదర్శ పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆయనే స్వయంగా మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ పరిసరాలను, పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్, సీఆర్పీలు కులారి వెంకటేశ్వర్లు, విజయ్ ఉన్నారు.

అధినేతల చిత్రపటాల బహూకరణ

సీతారామపురం, జూలై 9 : జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఆల్లూరి రవీంద్ర, మండల అధ్యక్షులు పాలి శెట్టి శీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో, ఎంఆర్‌ఓ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను బహుకరించారు. మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, రవీంద్ర మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో చేయలేని పనులు ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నెల రోజుల్లోనే చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, ఎడమ ప్రవీన్, రఘు,బండి రవి, సింగాల సుబ్బయ్య, సర్పంచ్ తోకల రామచంద్ర, నల్లి రామయ్య,కల్లూరి సురేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సునీల్ ఫోటోలను మంగళవారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నేటి ఆదేశాల మేరకు ఈ ఫోటోలను మండలంలోని 12 సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

ఉదయగిరి రూరల్, జూలై 9: పాఠశాలల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మరుగుదొడ్లు, తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ మండల కన్వీనర్‌గా బత్తల

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 9: ఆంధ్ర విద్యార్థి సంఘం(ఏవీఎస్) మండల కన్వీనర్‌గా బత్తల తిరుపతి నియమితులయ్యారు. మంగళవారం ఏవీఎస్ నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో తిరుపతిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన సంస్థ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తురకా ప్రసాద్, అశోక్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.













నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన బీద రవిచంద్ర


మంత్రిని సత్కరిస్తున్న బీద రవిచంద్ర

నెల్లూరు(వైద్యం), జూలై 9 : రాష్ట్ర భూగర్భ, గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మంగళవారం విజయవాడలోని మంత్రి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూటూరు కన్నబాబు, గిలక నరేంద్ర, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో అధునాతన ట్రక్ వీల్ వాషింగ్

ముత్తుకూరు, జూలై 9 : అదానీ కృష్ణపట్నం పోర్టు సౌత్ గేట్ నుంచి ఓడరేవు వెలుపలకు వెళ్లే అన్ని అవుట్ గోయింగ్ ట్రక్కుల చక్రాల నుంచి ధూళి, శిథిలాలు, సిల్ట్‌ను తొలగించడానికి ట్రక్ వీల్ వాషింగ్ కేంద్రాన్ని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొత్త వీల్ వాషింగ్ సదుపాయం అధునాతనమైనదని, ఆయిల్ స్కిమ్మర్, కడిగిన నీటి నుంచి వేరు చేసే ఆటోమేటిక్ సెన్సార్ ఆధారిత సాంకేతికతను కలిగి ఉందన్నారు. ఈ సదుపాయంతో నీటి వినియోగాన్ని తగ్గించడానికి, కడిగిన నీటిని రీసైక్లింగ్‌కు ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజన్‌బాబు, హెచ్‌ఆర్ హెడ్ గణేష్ శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ రామ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది కొరత తీర్చండి

- ఎస్‌ఈని కోరిన టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి


ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(సిటీ), జూలై 9 : నెల్లూరురూరల్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, వారి కొరత తీర్చాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆ శాఖ ఎస్‌ఈ విజయన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులతో కలిసి ఎస్‌ఈ కార్యాలయానికి వెళ్లిన ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్లలో సహాయ, జూనియర్ లైన్‌మెన్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. దీని వల్ల విద్యుత్ పరమైన సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు విద్యుత్ పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

'అమరావతి'లో గలీజు!

- ఫ్రీజర్‌లో చెడిపోయిన మాంసం
- ఆహారంలో ఎలుకలు, పందికొక్కుల వ్యర్థాలు
- అధికారుల తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- రెస్టారెంట్ మూసివేతకు నోటీసుల జారీ



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), జూలై 9 : కుళ్లిపోయిన చికెన్, చెడిపోయి దుర్వాన వస్తున్న మటన్, వ్యర్థంగా మారిన ఫిష్.. వీటి పక్కనే ఎలుకలు, పందికొక్కుల వ్యర్థాలు.. వింటుటేనే అసహ్యంగా ఉంటే.. ఇక కళ్లారా చూస్తే.. వామ్మో అంటారు. నెల్లూరులోని మాగంట లేఅవుట్ వద్ద ఉన్న అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఈ గలీజు వాతావరణం అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. సోమవారం హోటళ్లు, రెస్టారెంట్లపై ఆకస్మికంగా దాడులు చేసి అక్కడ పరిశుభ్రతను పసికట్టాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాలు జారీ చేయడంతో ఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణయ్య రంగంలోకి దిగారు. ఈ తనిఖీల్లో భాగంగా అమరావతి రెస్టారెంట్లోకి వెళ్లి వంటశాలను పరిశీలించగా అక్కడ ఫ్రీజర్లో నిల్వ ఉంచి మాంసపు పదార్థాలు దుర్వాసన రావడాన్ని గమనించారు. వాటిని బయటకు తీయ్యగా అవి పాడై రోజులు గడుస్తున్నట్లు నిర్ధారించారు. వెంటనే వాటిపై ఫినాయిల్ పోసి నిర్వీర్యం చేశారు. అదే వంటశాలలో ఎలుకలు, పందికొక్కులు పెంటను గమనించిన అధికారులు అవి కాస్త ఆహారంలో కలుషితమవడాన్ని గుర్తించారు. వెంటనే హోటల్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసి రెస్టారెంట్ మూతకు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వకపోతే శాశ్వతంగా మూతేస్తామని హెచ్చరించి రూ.50 వేలు జరిమానా విధించారు. నెల్లూరులో ప్రముఖంగా ఉన్న హోటళ్లలో ఇలాంటి పరిస్థితి ఉందని తెలుసుకున్న ఆహార ప్రియులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కొడవలూరు, జూలై 9: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండలంలోని యల్లయపాలెం సచివాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ప్రజాసమస్యల పరిష్కార తీరును పర్యవేక్షించారు. పెండింగ్‌లోని సమస్యలపై అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ప్రజలు అవసరాలు తీర్చడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం పింఛన్లు, ఇళ్ల పట్టాలు, రోడ్లు, మురుగుకాలువలు తదితర స్థానిక సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యల్లయపాళెం స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, తరగతుల గదులను సందర్శించారు. అలాగే మహబూబ్ సుబాని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం నాయకులు, సోదరులు 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారుకార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, ఏకోళ్ల వంశీధర్ రెడ్డి, బడుగు శ్రీనివాసులు పాలొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసిన కనగాల మధు

నెల్లూరు(హరనాథపురం) : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన నేపథ్యంలో టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధు నాయకత్వంలో చేపట్టిన గుంటూరు టూ తిరుమల కాలినడక యాత్ర మంగళవారం నెల్లూరుకు చేరుకుంది. ఈ పాదయాత్రలో టీడీపీ కార్యకర్తలు మధు ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అభినందించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేమంగా తిరుమలకు చేరుకొని మొక్కు చెల్లించుకోవాలని కోరారు.

నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు త్వరలో 110 బస్సులు

- ఆర్‌ఎం విజయరత్నం


డ్రైవర్లకు నగదు అందజేస్తున్న విజయరత్నం

రాపూరు(డక్కిలి), జూలై 9 : నెల్లూరు రీజియన్‌కు కొత్తగా 110 బస్సులు రానున్నట్లు జిల్లా ఆర్టీసీ ఆర్‌ఎం విజయరత్నం తెలిపారు. మంగళవారం ఆయన రాపూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాపూరు డిపో కు కూడా కొత్త బస్సులు ఇస్తామన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడపడం జరుగుతుందన్నారు. రాపూరు ఆర్టీసీ డిపో ఆదాయంలో మొదటి స్థానంలో ఉందన్నారు. 110 కొత్త బస్సులే కాకుండా అదనంగా మరో 14 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన పలువురు సిబ్బందికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్‌కుమార్ ఉన్నారు.

వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలి


డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 9: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పిన విధంగా వ్యర్థాల నుంచి సంపదను సృష్టిండంపై మార్గాలను అన్వేషించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. మంగళవారం అల్లీపురం వద్ద, దొంతాలి అటవీ ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డులను జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ నిరుద్యోగులైన యువత చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువులుగా మార్చేందుకు, ఘన వ్యర్థాలను శుద్ధి చేసి మళ్లీ వినియోగించే ప్రక్రియపై దృష్టి సారించాలని సూచించారు.

పెంకాక్ సిలాట్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్

నెల్లూరురూరల్, జూలై 9 : పాండిచ్చేరిలో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించిన పెంకాక్ సిలాట్ 5వ సౌత్ జోన్ పోటీలలో నెల్లూరురూరల్‌లోని బుజబుజనెల్లూరు శేషు స్కూల్ విద్యార్థి శ్రీరామకృష్ణారెడ్డి బంగారు పతకాన్ని సాధించినట్లు స్కూల్ కరస్పాడెంట్ బీ శేషుయాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్కూల్లో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాండిచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు ఘనంగా జరిగాయన్నారు. జాతీయ స్థాయికి తమ విద్యార్థి ఎంపిక అయ్యాడని తెలిపారు. అక్కడ కూడా మంచి ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ఎంఈవో ఎప్పటికొస్తారో..?

మనుబోలు, జూలై 9: మండలానికి విద్యాశాఖాధికారి లేక పదిరోజులుగా కుర్చీ వెలవెలబోతోంది. మండలానికి ఇద్దరు ఎంఈవోలు ఉండేవారు. ప్రధాన ఎంఈవో శేషాద్రివాసు గతనెల 30న పదవీ విరమణ గావించారు. ఎంఈవో-2గా ఉన్న రమేష్ కుమార్ జూన్ 12 నుంచి ఆరునెలల సెలవుతో విదేశాలకు వెళ్లారు. దీంతో మండలానికి ఇన్‌చార్జి ఎంఈవోగా తోటపల్లి గూడూరు మండలం ఎంఈవోకి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. దీంతో మండలంలో ఎంఈవో లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానోపాధ్యాయులు సెలవులు పెట్టుకోవాలంటే ఎంఈవో అనుమతి తప్పనిసరి. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను బదిలీ చేయాలన్న ఎంఈవో అనుమతి కావాలి. ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంఈవో కోసం ఎదురుచూస్తున్నారు.


వెలవెలబోతున్న ఎంఈవో కుర్చీ

టీడీపీతోనే అమరావతి నిర్మాణం సాధ్యం

- మనుబోలుకు చేరిన రైతుల పాదయాత్ర


తిరుమలకు వెళుతున్న అమరావతి రైతులు

మనుబోలు, జూలై 9: టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అమరావతి నిర్మాణం సాధ్యమవుతుందని అమరావతి రైతులు తెలిపారు. అమరావతి నుంచి తిరుమలకు చేపట్టిన కృతజ్ఞత పాదయాత్ర మంగళవారం వేకువ జామున మనుబోలుకు చేరుకుంది. ఈ పాదయాత్రలో ఎక్కువగా మహిళా రైతులు ఉండటం విశేషం. వారు మాట్లాడుతూ 2020లో వైసీపీ ప్రభుత్వం చేసిన ఆరాచకాలతో వైసీపీ ప్రభుత్వం పోవాలని వెంకన్నను మొక్కుకున్నామని, మా మొర ఆలకించిన శ్రీనివాసుడు అమరావతిని రక్షించే టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. దీంతో మొక్కు తీర్చుకునేందుకు కృతజ్ఞత పాదయాత్రను గతనెల 24న అమరావతిలో ప్రారంభించామన్నారు. అమరావతి రైతులకు మనుబోలులో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి కలికి రమేష్ రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు

- చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నాయకుల డిమాండ్


విద్యుత్ శాఖ ఏడీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, జూలై 9 : పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నారని, అటువంటి వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలంటూ టీడీపీ సీనియర్ నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, రావూరి సుధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ ఏడీ బీ.సురేంద్రబాబును కలిసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నాయకులు దుకాణాల వద్ద ఇష్టారీతిగా సొంత లాభం చూసుకుని ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన డీడీలు, విద్యుత్ శాఖవారి అంచనా లేకుండానే చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాలకొండకు పాదయాత్ర


మాలకొండకు పాదయాత్ర చేపడుతున్న నూకరాజు మదన్‌మోహన్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 9 : ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో మూడవసారి విజయం సాధించాలని మొక్కుకున్న మొక్కును తీర్చేందుకు మంగళవారం నగర టీడీపీ కార్పొరేటర్ నూకరాజు మదనమోహన్‌రెడ్డి మాలకొండకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారని తెలిపారు. దీంతో 50 మంది అనుచరులతో మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్రగా మాలకొండకు వెళుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో తొలి వేటు

- ఇంజనీరింగ్ విభాగంలో డ్రాఫ్ట్‌మన్ అజంతా బదిలీ
- బీసీవీఆర్ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు

నెల్లూరు(సిటీ), జూలై 9 : వైసీపీ ప్రభుత్వంలో నాయకులు, ప్రజా ప్రతినిధులతో అంటకాగిన ఉద్యోగులు, అధికారులపై టీడీపీ ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది. నియమనిబంధనలను తుంగలో తొక్కి గత ప్రభుత్వంలో నాయకులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా పని చేసిన ఉద్యోగులు ప్రస్తుతం బదిలీ వేటుకు గురవుతున్నారు. అందులో భాగంగా నెల్లూరు కార్పొరేషన్‌లో తొలి బదిలీ వేటు పడింది. ఇంజనీరింగ్ విభాగంలో ఎం బుక్కులు స్క్రూట్నీ, బిల్ ఫైల్స్ రాస్తూ కీలకంగా వ్యవహరించే డ్రాఫ్ట్‌మెన్ ఎం అజంతాను ఆ పోస్టు నుంచి బదిలీ చేస్తూ కమిషనర్ వికాస్‌మర్మత్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఆ ఉత్తర్వులు మంగళవారం బయటకు వచ్చాయి. గత ఏడాది కాలం పాటు కార్పొరేషన్‌లో వైసీపీ నాయకులు అడ్డగోలుగా బిల్లులు తయారు చేయడంలో కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను కొందరు టీడీపీ నాయకుల ఫిర్యాదుతో తాజాగా బదిలీ చేశారు. కేఎన్‌ఆర్ స్కూల్లో రెగ్యులర్ పోస్టు అయినప్పటికీ రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఇంజనీరింగ్‌లో చక్రం తిప్పుడంపై అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. ఆమె స్థానంలో అదే సెక్షన్‌లో పని చేస్తున్న బీసీవీఆర్ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నెల్లూరు(విద్య), జూలై 9 : జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్నల్ ఆధ్వర్యంలో నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి కెరీర్ ఉన్నతికి వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. యువత తమకు ఇష్టమైన కోర్సులను ఎంపిక చేసుకుంటే మంచి విజయాలను సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ కెరీర్‌ను గట్టి పునాదులతో ప్రారంభిస్తే భవిష్యత్‌లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఉన్నతంగా రాణించవచ్చని తెలిపారు. అనంతరం కెరీర్ గైడెన్స్‌పై పలు అంశాలను విద్యార్థులకు తెలియచేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే అధికారి మహీధర్‌రెడ్డి, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్‌అహ్మద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలు తగదు

కొడవలూరు జూలై 9: సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై మాజీ శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు చేయడం తగదని మాజీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలో నార్తు రాజుపాళెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లిలో వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డు పెట్టుకొని అన్యాయాలు, అక్రమాలకు పాల్పడిన కాకాణి గోవర్ధన్ రెడ్డి ఓటమి జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తూ వ్యక్తి దూషణలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

పీఎం పోషణ గోరుముద్ద పరిశీలన

ఇందుకూరుపేట, జూలై 9: పీవీకండ్రిగ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాధికారి సునీల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పీఎం పోషణ గోరుముద్ద మెనూ ప్రకారం రోజూ గుడ్డు, రోజుమార్చి రోజు చిక్కి, రోజుమార్చి రోజు రాగిజావ ఇవ్వాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్టూడెంట్స్ కిట్స్ ఉచిత పుస్తకాలు యూనిఫాం, బెల్టు, బూట్లు, సాక్షులు అందరికీ అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంకెవరైనా పాఠశాలకు వెళ్లకుండా బడి మానేసిన పిల్లలు ఉంటే అలాంటి వారిని వెంటనే పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్యను ఆదేశించారు. అనంతరం నూతన మరుగుదొడ్లు, నూతన వంట గది, పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించారు.

అన్నా క్యాంటీన్‌కు అనుకూల ప్రదేశంపై సర్వే

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 9: స్థానిక బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు పరిసర ప్రాంతంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన ప్రదేశం కోసం మంగళవారం సర్వేయర్, మున్సిపాలిటీ సిబ్బందితో మార్కెట్టు ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించారు. అనంతనం బుచ్చిలో చనిపోయిన వారి అంత్యక్రియల నిమిత్తం భవనం నిర్మించేందుకు దాతలు ముందుకువచ్చారు. ఈ మేరకు వారు ఆ విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. భవనం నిర్మించేందుకు నగర పంచాయతీ కమిషనర్ ఆదేశాలతో అనుకూలమైన స్థలం కోసం చూశారు.

సోమిరెడ్డిని విమర్శించే స్థాయి నీకుందా..?

పొదలకూరు, జూలై 9 : పొదలకూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు బిరదవోలు మహేంద్ర ఒళ్లు దగ్గర పెట్టుకుని మసలుకోవాలని, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డిని విమర్శించే అర్హత తనకు ఉందా అంటూ పొదలకూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంగి వెంకటరమణయ్య, తిరుపతి పార్లమెంటు సెల్ కార్యదర్శి అలుపూరు శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మహేంద్ర స్థాయికి మించి మాట్లాడడం సరికాదన్నారు. తాను మాజీ మంత్రి కాకాణి ఇంట్లో కేవలం రబ్బరు స్టాంపు లాంటివాడని తెలిపారు. తమ నాయకుడు సోమిరెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం టీఎన్‌ఎస్‌ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లిని సర్వనాశనం చేశారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలవడంతో జీర్ణించుకోలేక మా నాయకుడు సోమిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేయడం సరికాదన్నారు. సర్వేపల్లి ప్రజలు ఇక కాకాణిని నమ్మే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, గుండాల వెంకటరమణయ్య, మాముదూరు ఆనంద్, తీకల పార్థసారథి, బొద్దు గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మా భూమికి రక్షణ కల్పించండి !

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 9 : వెంకటాచలం మండలం కందమూరులో తమ భూమిలో వ్యవసాయ పనులు చేయనీయకుండా భూస్వామి అడ్డుకుంటూ దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు పట్టపు సుబ్బయ్య, రమణయ్య, తాటిపర్తి వెంకటరమణయ్య, రమణయ్య, పల్లెపాడు విజయలక్ష్మి, తదితరులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సర్వే నెంబరు 57లో 8ఎకరాల 20సెంట్లు కొండ పోరంబోకును తాము చదును చేసుకుని వ్యవసాయం చేసుకున్నామన్నారు. ప్రభుత్వం రీసర్వేలో భూమి లేని తమకు ఆ సర్వే నెంబరులో తమకు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. తాము పట్టాలు పొందినప్పటికీ తమను వ్యవసాయ పనులు చేసుకునివ్వకుండా ఓ బ్యాంకు ఉద్యోగి దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. తమ భూమికి రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

పాత బకాయిలు వెంటనే చెల్లించాలి

వెంకటాచలం, జూలై 9 : పాత బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులు, నాయకులు ఎంపీడీవో ముజీబున్నిసాకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నానాటికి దిగజారిపోయిందని, పాత బకాయిలు వెంటనే చెల్లించాలని, ఒక్కొక్క కుటుంబానికి 24 రోజుల పని దినాన్ని కల్పించి రోజుకి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓడూరు వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, షేక్ నజీర్, సుధాకర్, వెంకయ్య, షేక్ చాన్‌బాషా తదితరులున్నారు.

24 గంటలు వైద్యం అందించండి

వెంకటాచలం, జూలై 9 : సీహెచ్‌సీ (సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం) సేవలు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆనంద్‌కు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి ఆరుముళ్ల మురళీ కోరారు. ఈమేరకు వెంకటాచలం సీహెచ్‌సీకి వచ్చిన కలెక్టర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. రహదారిపై ప్రమాదాల బారిన పడిన వారికి సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

'సామ్నా' అధ్యక్షుడు రామమూర్తి మృతి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 9 : సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, స్టేట్‌లీడర్ పత్రిక వ్యవస్థాపకుడు, సామ్నా జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి రామమూర్తి మంగళవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన మరణం పట్ల జిల్లాలోని అన్ని జర్నలిస్టు సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్నవారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

సంగం, జూలై 9: పశుగ్రాసం మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏడీ జయచంద్ర ఆధ్వర్యంలో స్థానిక పశు వైద్యశాలలో పశుగ్రాసం పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసంలో రకాలు, పెంపకం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ప్రయోజనాలపై వివరించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి సురేష్‌బాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఉదయగిరి రూరల్: విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. మంగళవారం బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుందర రామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం: దువ్వూరు, మర్రిపాడు గ్రామాల్లో నిరుపేద కుటుంబాల వారికి జనసేన నాయకులు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆత్మకూరు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, ఎన్‌ఆర్‌ఐ హరీష్ కుమార్ చేతుల మీదుగా నక్కా రమణమ్మ, కందికట్టు రాజా, గరికపాటి రమణమ్మ, భీమతాటి వెంకయ్య కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.



జిల్లాలో అతిసార కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గత నెల ఒకటవ తేదీ నుంచీ ఇప్పటి వరకూ అతిసార సోకి ఐదుగురు మృతి చెందగా సంబంధిత లక్షణాలతో 400 మందికి పైగా అస్వస్థతకు లోనయ్యారు.పలువురు బాధితులు స్థానికంగా వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకుంటుండగా సీరియస్ కేసులు మాత్రం రుయాస్పత్రికి వస్తున్నాయి. కొన్నిచోట్ల కలుషిత ఆహారం కారణంగా అతిసార ప్రబలగా మరికొన్ని చోట్ల కలుషిత తాగునీటి వల్ల ఆ వ్యాధి సోకుతోంది.



తిరుపతి శివారులోని ఆటో నగర్‌లో ఇదీ పరిస్థితి

ప్రబలుతున్న అతిసార

39రోజుల్లో ఐదుగురు మృతి... 400మందికి పైగా అస్వస్థత

కలుషిత ఆహారం, తాగునీరే కారణం



తిరుపతిలోని నిమ్మకాయల వీధిలో మంగళవారం ఉదయం రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీళ్లు

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం నందిమంగళంలో జూన్ 1న అతిసార ప్రబలింది. తాగునీటి పైపులైన్ లీకేజీ వుండడం వల్ల డ్రైనేజీ నీరు కలసిపోయి తాగునీరు కలుషితమైంది. ఈ నీటిని తాగడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురై రాజగోపాలాచారి (70) గత నెల 6న మరణించగా నందిమంగళం దళితవాడకు చెందిన చిన్నారి దివ్య (12) గత నెల 8న మృతి చెందింది. కేవీబీపురం మండలం కాట్రపల్లిలో కలుషిత ఆహారం తీసుకున్న కారణంగా పలువురు అస్వస్థతకు లోనుకాగా వారిలో రెండేళ్ళ చిన్నారి దర్శిని మృత్యువాత పడింది. తిరుపతిలోని మనోవికాస్ మానసిక వికలాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా అతిసార ప్రబలడంతో పదిమంది అనారోగ్యానికి లోనయ్యారు. వారిలో గణపతి (35) సోమవారం మరణించగా శేషాచలం (16) మంగళవారం చనిపోయారు.

కోట మండలంలో 230 కేసుల నమోదు

కోట మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో గత నెల 1వ తేదీ నుంచీ 180 మంది డయేరియాతో చికిత్స కోసం చేరారు. చిట్టేడులోని హెల్త్ సబ్ సెంటర్‌లో 50 మంది చికిత్స పొందారు.బాధితులంతా కలుషిత ఆహారం తీసుకున్న కారణంగానే చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చారని వైద్యులు చెబుతున్నారు.

గూడూరు మండలంలో 42 మందికి అతిసార

గూడూరు మండలం చెన్నూరు గిరిజన సంక్షేమ గురుకులంలో గత నెల 22న తాగునీటి ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైంది. గత్యంతరం లేక విద్యార్థులు బోరు నీటిని తాగారు. ఆ నీరు కలుషితమై వుండడంతో 20 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు లోనయ్యారు. వీరిలో 12 మంది పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. మిగిలిన వారికి వైద్య సిబ్బంది గురుకులంలోనే చికిత్స అందించింది. కాగా గూడూరు ఏరియా ఆస్పత్రిలో గత నెల నుంచీ ఇప్పటి దాకా 22 మంది అతిసార లక్షణాలతో చేరి చికిత్స పొందారు. మొత్తం 42 మంది మండలంలో అతిసార కేసులు నమోదయ్యాయి.

కేవీబీపురంలో 40... ఏర్పేడులో 20 కేసులు

కేవీబీపురం మండలం కాట్రపల్లి, మఠం గ్రామాల్లో కలుషిత ఆహారం తీసుకున్న కారణంగా వాంతులు, విరేచనాలతో 40 మంది అనారోగ్యానికి గురయ్యారు. వీరిని శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇందులో కాట్రపల్లికి చెందిన రెండేళ్ళ చిన్నారి చికిత్స పొందుతూ మరణించింది. ఏర్పేడు మండలంలో గత నెల 18న మడిబాక దళిత వాడ, అరుంధతి వాడల్లో అతిసార ప్రబలింది. తాగునీటి ట్యాంకులోకి వర్షపు నీరు చేరడంతో నీరు కలుషితమైంది. ఆ నీటిని వినియోగించడంతో 20 మంది అనారోగ్యానికి లోనయ్యారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే శిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందించారు.

తడలో పది... చిల్లకూరులో ఐదు

తడ మండలంలో పది అతిసార కేసులు నమోదయ్యాయి.వెంకటాద్రిపాలెం, పన్నంగాడు, బాలాజీ కుప్పం, పూడి, తడ, చేనిగుంట గ్రామాలకు చెందిన పదిమంది కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు లోనయ్యారు. చిల్లకూరు మండల కేంద్రంలోని దళితవాడలో గత నెల ఐదుగురికి అతిసార సోకింది. కలుషిత ఆహారమే కారణమని గ్రామస్థులు చెబుతున్నారు.

ఆస్పత్రులవారీగా....

జిల్లాలో గత నెల నుంచీ ఆస్పత్రుల్లో అతిసార కేసులు తరచుగా నమోదవుతున్నాయి. తిరుపతి రుయా ఆస్పత్రిలో 80 కేసులు నమోదయ్యాయి. వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో 92 కేసులు నమోదు కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 176 కేసులు నమోదయ్యాయి. తీవ్ర అనారోగ్యానికి గురైన బాధితులు మాత్రమే తిరుపతి రుయాస్పత్రికి వస్తుండగా మిగిలిన వారు స్థానికంగా వున్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స తీసుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే వుంది. గూడూరు, పుత్తూరు, కేవీబీపురం, శ్రీకాళహస్తి, రేణిగుంట, చంద్రగిరి తదితర మండలాలతో పాటు మదనపల్లె, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచీ ఎక్కువగా అతిసార లక్షణాలతో బాధితులు రుయాస్పత్రికి వస్తున్నారు.

ఐదేళ్ళలో నిర్లక్ష్యానికి గురైన తాగునీటి సరఫరా వ్యవస్థ

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ గత ఐదేళ్ళలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. తాగునీటి పైపులైన్ల మరమ్మతుల గురించి పట్టించుకున్న నాధుడు లేకుండా పోయారు. కనీసం తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే దిక్కు కూడా లేకపోయింది. దాని పర్యవసానం ఇపుడిపుడే జనానికి అనుభవంలోకి వస్తోంది. తాగునీటి పైపులైన్లు లీకేజీలకు గురి కావడం, పైపులైన్లు దెబ్బతినడంతో మురుగునీరు, వర్షపు నీరు పైపుల్లోకి చేరి నీరు కలుషితమవుతోంది.ట్యాంకులను శుభ్రపరచకపోవడం వల్ల కూడా నీరు కలుషితం కావడం, వర్షపు నీరు చేరడం జరుగుతోంది. ఇప్పుడైనా జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తాగునీటి పైపులైన్ల పరిస్థితిని తనిఖీ చేయించి అవసరమైన చోట్ల దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన తక్షణావసరముంది.



పాస్ మనో వికాస్ కేంద్రం

డయేరియాతో ఇద్దరు దివ్యాంగుల మృతి

రుయాలో చికిత్స పొందుతున్న 16మంది

పాస్ మనోవికాస్ కేంద్ర నిర్వాహకుల అలక్ష్యం

విచారణకు కలెక్టర్ ఆదేశం



శేషాచలం మృతదేహం

పాస్ మనో వికాస్‌కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్/వైద్యం), జూలై 9 : వారంతా మానసిక దివ్యాంగులు. తిన్న ఆహారం సరిపడక వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించకుండా అందుబాటులో వున్న ఆయుర్వేద డాక్టరుతో వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఒకరు, సోమవారం మరొకరు చనిపోయారు. వివరాల్లోకి వెళితే...తిరుపతి రూరల్ మండ లం పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో బాల బాలికలతోపాటు 30 ఏళ్ల వయస్సు పైబడిన మానసిక వ్యాధిగ్రస్థులు, అనాథలు కలిపి 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 22మంది అనాథలు కాగా మరో 52మంది మానసిక వ్యాధులతో బాధపడే దివ్యాంగులు ఉన్నారు. వీరికి ఆదివారం సాయంత్రం ఆశ్రమ నిర్వాహకులు బోండాలు, సాంబారు కలిపి ఆహారం పెట్టారు. సోమవారం తెల్లవారుజామున కొందరికి వాంతులు, విరోచనాలు కావడంతో ఆశ్రమంలో ఉన్న ఆయుర్వేద డాక్టరు మందులు ఇచ్చారు.వాంతులు, విరోచనాలు ఆగకపోగా గణపతి(30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడిని సోమవారం ఉదయం రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి గణపతి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో గణపతికి అయిన వారు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులే గణపతి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఖననం చేశారు. ఆశ్రమంలో ఉన్న మరికొందరికి కూడా వాంతులు, విరోచనాలు అవుతుండడంతో ఆశ్రమ నిర్వాహకులు అందుబాటులో ఉన్న ఆయుర్వేద వైద్యుడితో చికిత్స అందించారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన మరో అనాథ బాలుడు శేషాచలం(16) డయేరియా లక్షణాలతో మంగళవారం ఉదయం మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, డీఎంహెచ్‌వో శ్రీహరి పాస్ మనోవికాస్ కేంద్రానికి చేరుకుని డయేరియా లక్షణాలతో బాధపడుతున్న కొంతమందిని ఆస్పత్రికి తరలించారు. మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు. రుయాలో 16మంది చికిత్స పొందుతుండగా వారిలో ప్రదీప్(20), తేజస్విని(25) అనే ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు. పాస్ మనోవికాస్ కేంద్రంలో అసలేం జరిగిందనే విషయంపై కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణకు ఆదేశించారు.దీంతో అక్కడ ఆహార పదార్థాలను, తాగునీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.తాగునీరు కలుషితం కాలేదని మంగళవారం రాత్రికి కలెక్టర్‌కు నివేదిక అందింది. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిక దివ్యాంగులను పరామర్శించారు.అలాగే పాస్‌మనోవికాస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఇంతమంది తీవ్ర అస్వస్థతకు గురైనా జిల్లా యంత్రాంగానికి తెలియకుండా ఎందుకు వుంచారంటూ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమంలోని వంటగదిని, తాగునీటిని పరిశీలించాక దీనిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని,వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.శనివారం బోండాలు తినడం వలనే తీవ్ర అస్వస్థతకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి శేషాచలం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రదీప్

గంజాయి మత్తులో యువకుల వీరంగం

- నారాయణ విద్యాసంస్థల బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి



ధ్వంసమైన బస్సు అద్దం



వీరంగం సృష్టించిన యువకులు

మంగళం, జూలై 9: గంజాయి మత్తులో ఇద్దరు యవకులు మంగళవారం సాయంత్రం నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. స్థానికులు, తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణ విద్యాసంస్థలకు చెందిన బస్సు 25 మంది విద్యార్థినులతో బయల్దేరింది. మంగళం బీటీఆర్ కాలనీ 16వ లైను వద్దకొచ్చేసరికి స్థానిక యువకులు బాలుప్రకాష్, మహేష్ అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ హారన్ కొట్టాడు. గంజాయి మత్తులో ఉన్న ఆ యువకులు అక్కడున్న రాళ్లను తీసుకుని బస్సు అద్దాలను పగులగొట్టారు. వాహనంలోని బాలికలు భయభ్రాంతులకు గురై కేకలు పెట్టారు. మరోవైపు డ్రైవర్ కుమార్‌ను కిందకు లాగి.. దుస్తులు చిరిగేలా కొట్టారు. అలాగే ఆ మార్గంలో వెళ్లే వాహనాలపైనా ఇలాగే దాడిచేస్తూ ఇబ్బందులు కల్గించారు. సమాచారం అందుకున్న మంగళం అవుట్ పోస్టు పోలీసులు అక్కడికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బస్సులో ఉన్న విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి వెంటపంపించారు. వీరంగం సృష్టించిన యువకులను, దాడికి గురైన బస్సును తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిలో కందిపప్పు రూ.160

బియ్యం రూ.48, స్టీమ్డ్ రైస్ రూ.49

తిరుపతి, గూడూరు రైతు బజార్లలో రేపటినుంచి పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయడంలో భాగంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గురువారం నుంచి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా తిరుపతి, గూడూరు రైతు బజార్లలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.170 పలుకుతోంది. రైతుబజార్ల ద్వారా కిలో రూ.160కే విక్రయించనున్నారు. స్టీమ్డ్ బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.56-57 ఉండగా, రైతు బజార్లలో కిలో రూ.49కి విక్రయిస్తారు. బియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.55-60 పలుకుతుండగా, రైతుబజార్లలో రూ.48కే విక్రయించనుంది. కాగా, జిల్లాకు దాదాపు ఐదు లక్షల టన్నుల కందిపప్పు అవసరం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గోడౌన్లలో కేవలం లక్ష టన్నులు కూడా లేదని సమాచారం. అవసరమైన కందిపప్పును తెప్పించడానికి ట్రేడర్లు ముందుకు రావడం లేదని తెలిసింది.

తల్లిదండ్రులకు పారిపోయిన బాలికల అప్పగింత

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చెప్పకుండా వచ్చేసి రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించిన బాలికలను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన రేణిగుంట మండలంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నైలో ఇరుగుపొరుగు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు భవన నిర్మాణ పనులకు కూలీలుగా వెళుతుంటారు. అదే పనుల్లో పరిచయమైన ఓ యువకుడితో కలసి ముగ్గురూ మంగళవారం చెన్నై నుంచి రైలులో రేణిగుంట బయల్దేరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రైలు రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద ఆగడంతో ముగ్గురూ అక్కడ కిందకు దిగేశారు. రైలు వెళ్లిపోయాక ట్రాక్‌పై నడిచి వెళుతుండగా చూసిన కొందరు అనుమానంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. గాజులమండ్యం పోలీసులు వెళ్లేసరికి యువకుడు పరారయ్యాడు. బాలికలను పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు విచారించి వివరాలు రాబట్టారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చేసినట్టు తెలియడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి నిర్ధారించుకున్నారు. పరారైన యువకుడి గురించి ఆరా తీయగా తమకు తెలిసిన వ్యక్తేనని బాలికలు చెప్పారు. ఎస్పీ ఆదేశాలతో మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను రక్షణగా పెట్టి చెన్నైకి పంపించారు. ఓ బాలిక తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో మరో బాలిక తల్లిదండ్రులకు ఇద్దరినీ అప్పగించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద రైలు దిగిన బాలికలపై గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని, వెంట ఉన్న యువకుడిపై కూడా దాడి చేశారని ప్రచారం జరిగింది. ఈ విషయమై ఎస్పీ హర్షవర్ధన్ రాజును వివరణ కోరగా.. బాలికలపై అత్యాచారం జరిగిందన్నది తప్పుడు ప్రచారమని ఖండించారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చిన బాలికలను క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని స్పష్టం చేశారు.

ఎర్రచందనం కేసులో ఏడాది జైలు

తిరుపతి(లీగల్), జూలై 9: ఎర్రచందనం కేసులో బీఎన్‌కండ్రిగమండలం కర్నిమిట్ట హరిజనవాడకు చెందిన సమ్మెట పెద్దగురవయ్యకు ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం స్పెషల్‌కోర్టు న్యాయమూర్తి ఎస్.శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. ఇతను 2016 మార్చి 12వ తేదీన శ్రీకాళహస్తి పరిధిలో ఓ వాహనంలో ఎర్రచందనం దుంగలు తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నిరూపణ కావడంతో న్యాయమూర్తి ఏడాది జైలుశిక్ష విధించారు.

రేపటినుంచి పాలిసెట్ చివరి విడత కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 9: పాలిసెట్-2024 చివరి విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానుందని తిరుపతి కో-ఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. మొదటి విడతలో హాజరు కాలేకపోయిన విద్యార్థులు గురువారం నుంచి ఈనెల 13వ తేదీలోపు ఆన్‌లైన్లో నిర్దేశించిన రుసుం చెల్లించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవచ్చని సూచించారు. 11 నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు చేసుకోవాలన్నారు. 16వ తేదీన సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని వెల్లడించారు. సీట్లు పొందినవారు ఈనెల 18 నుంచి 20వ తేదీలోపు ఆయా పాలిటెక్నిక్‌లలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

మండల పరిషత్ నిధులు పక్కదారి?

లక్షల విలువైన ఎంబుక్‌లు గల్లంతు ● కానరాని క్యాష్ బుక్...

కోట, జూలై 9 : కోట మండల పరిషత్‌లో నిధులు పక్కదారి పట్టాయని ఒక పక్క అధికార పార్టీ ఎంపీటీసీ సభ్యులు, మరో పక్క మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిషత్‌లో పనులకు సంబంధించి సర్వసభ్య సమావేశంలో తీర్మానం లేకుండానే పనులు జరిగినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి వరకు ఆర్థిక లావాదేవీలపై ఉండాల్సిన క్యాష్ బుక్ గల్లంతైనట్లు తెలిసింది. ఆ సంవత్సర కాలంలో మండల పరిషత్‌లో పలు రకాల కొనుగోళ్లు, ఖర్చులు, తదితర అంశాల సంబంధించి కీలకంగా క్యాష్ బుక్‌లో నమోదు చేసి ఉంటారు. ఆ బుక్ ఎంపీపీ పర్యవేక్షణలో మండల పరిషత్‌లో ఉంటుంది. ఈ బుక్‌లో లావాదేవీలను మండల పరిషత్ సూపరింటెండెంట్ నమోదు చేస్తుంటారు. అయితే ఏడాదిన్నరగా మండల పరిషత్ సూపరింటెండెంట్ నెల్లూరు జిల్లా పరిషత్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయితే ఆ క్యాష్ బుక్ ఏమైందోనన్న విషయంపై మండలంలో సర్వత్ర చర్చ జరుగుతోంది. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ప్రతి పైసా కొనుగోలుకు ఓచర్లు ఉండాలి. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఓచర్లు లేవు. అదే విధంగా 2023 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.50లక్షలకు పైగా పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి జనరల్ ఫండ్ నిధులు కూడా గుత్తేదారులకు ఇచ్చారు. అయితే పనులు జరిగిన తరువాత ఎంబుక్‌లను (మెజర్‌మెంట్ బుక్) ఆధారంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే లక్షలాది రూపాయలకు సంబంధించిన ఆ ఎంబుక్‌లు బిల్లులు చెల్లింపులు అయినప్పటికీ మండల పరిషత్ కార్యాలయంలో గల్లంతైనట్లు తెలిసింది. ఆయా ఎంబుక్‌లను ఈ నెల 12వ తేదీ లోపు తమకు ఇవ్వకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీడీవో శంకరయ్య హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు. ఇదిలాఉండగా 2023 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 21 పంచాయతీలకు గాను కొన్ని పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా జనరల్ ఫండ్‌ను చెల్లించినట్లు తెలిసింది. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న లక్షలాది రూపాయల పనులకు సర్వసభ్య సమావేశం అనుమతులు లేకుండానే జరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పనులకు బిల్లులు ఎలా చెల్లిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిగ్గు తేల్చండి: ఎంపీటీసీ సభ్యులు

మండల పరిషత్‌లో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో తక్షణం ఆ నిధులకు సంబంధించి నిగ్గు తేల్చాలని కోట పట్టణానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు షేక్ షంషుద్దీన్, దారా సురేష్ డిమాండ్ చేస్తున్నారు.



కోట మండల పరిషత్ కార్యాలయం

అనుమతులు లేకుండా పనులు చేయడం, కొన్ని నిధులు అక్రమార్గంలో దారి మళ్లడంపై తక్షణం విచారణ జరపాలని ఈవోపీఆర్‌డీ వినతిపత్రం అందజేసి ఉన్నారు.

ఎంబుక్‌లు గల్లంతు వాస్తవమే...

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 152 పనులకు సంబంధించిన ఎంబుక్‌లు గల్లంతు వాస్తవమే. మూడు రోజుల్లో ఆ బుక్‌లు చేరకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా. కొన్ని పనులు మండల పరిషత్ ఆమోదం లేకుండానే జరిగాయి. దీనిపై కూడా నివేదికలు తయారు చేస్తున్నా. కలెక్టర్‌కు పంపుతా.

- ఎం శంకరయ్య, ఎంపీడీవో

5నుంచి పినాకిని, జన శతాబ్ది రైళ్ల రద్దు

తిరుపతి, జూలై 9: విజయవాడ యార్డ్ పరిధిలో మరమ్మతుల కారణంగా పినాకిని, జనశతాబ్ది రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.12711 విజయవాడ- చెన్నై సెంట్రల్, నెం.12712 చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.12077 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - విజయవాడ, నెం.12078 విజయవాడ - డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.17237 బిట్రగుంట- చెన్నై సెంట్రల్, నెం.17238 చెన్నై సెంట్రల్ - బిట్రగుంట ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4 నుంచి 11వ తేది వరకు పూర్తిగా రద్దు.

దారి మళ్లింపు...

- నెం.12760 హైదరాబాద్ నుంచి సాయంత్రం 6 గంటలకు తాంబరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుంచి 10వ తేది వరకు వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడకు బదులుగా పగిడిపల్లి, గుంటూరు, తెనాలి మీదుగా మళ్లింపు. ఈ రైలుకు నల్గొండ, గుంటూరులో అదనపు హాల్ట్.
- నెం.12759 తాంబరం నుంచి సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ వెళ్లే రైలు ఆగస్టు 2 నుంచి 10వ తేది వరకు విజయవాడ, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, ఖాజీపేటకు బదులుగా తెనాలి, గుంటూరు, పడిగిపల్లి మీదుగా మళ్లింపు. ఈ రైలుకు గుంటూరు, నల్గొండలో అదనపు హాల్ట్.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి



మాట్లాడుతున్న హెచ్‌ఆర్ నాగరాజు

గూడూరు, జూలై 9: ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటే ఉద్యోగావకాశాలు పొందవచ్చని డెల్ఫీ టీవీఎస్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో డెల్ఫీ టీవీఎస్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో 270 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజామురగదాస్, డాక్టర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 9: స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం జన విజ్ఞా వేదిక ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ... ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వి.రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చర్యలు

చిల్లకూరు, జూలై 9: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎంపీఐ సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలను కాపాడు కోవచ్చన్నారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే పాశిం విన్నపం



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 9: గూడూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మిచౌంగ్ తుఫాన్ కారణంగా నియోజకవర్గ పరిధిలోని వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద కాజ్‌వే దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమూరు వద్ద 30 మీటర్ల మేర తెగిన రోడ్డు, పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటల తొలగింపు సహా తాగునీటి సమస్యను ఎరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చాన్‌బాషా, బి.చెంచురామయ్య, శ్రీపతిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 9: ప్రతిఒక్కరూ సొంత ఇంటి కలను నెరవేర్చుకునేలా ఇసుక ఉచిత పంపిణీని సీఎం చంద్రబాబు ప్రజలకు చేరువ చేశారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మొగళ్లగుంట వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడమే సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుక పంపిణీ పూర్తయిన తరువాత తదుపరి ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా కార్యక్రమాన్ని అధికారులు నిర్ణయిస్తారన్నారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్ ఎక్స్‌కవేటర్‌కు పూజలు నిర్వహించి ఇసుక ఎత్తే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ నాయకుడు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు బి.రాజేశ్వరరావు, పి.చంద్రమౌళిరెడ్డి, కేవీకే ప్రసాద్‌నాయుడు, కె.శ్రీనివాసులునాయుడు, పి.కోటేశ్వరరెడ్డి, చెంగారావు, ఎం.బాబు, తహసీల్దారు సాంబశివరావు, ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి, సీఐ సంగమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌నజీర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలందిస్తున్న విజయశ్రీ, వేనాటి సతీష్ రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట/నాయుడుపేట, జూలై 9: జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా వచ్చిన కలెక్టర్‌ను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, ఆకుతోట రమేష్, 786 రఫీ, వేమసాని శ్రీనివాసుల నాయుడు, సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు ఉన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను నాయుడుపేట టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్‌కు టీడీపీ సీనియర్ నేత వేనాటి సతీష్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. కె.కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, పెరుమాల్ తదితరులు ఉన్నారు.

క్వార్ట్జ్, సిలికా భోక్తలపై వేటు!?

ఇప్పటికే నివేదిక అందజేత ● సీఎం ఆదేశాలతో వైసీపీ నేతల్లో వణుకు ● వందలాది కేసులు నమోదయ్యే అవకాశం

నెల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాపం పండుతోంది. అధికారమే అండగా సహజ వనరులను అడ్డంగా దోచుకుతిన్న వైసీపీ వర్గాలపై వేటుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంగా గత ఐదేళ్లలో సాగిన సిలికా, క్వార్ట్జ్ దోపిడీపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. అగ్రనాయకుల కోసం ఇష్టారాజ్యంగా సిలికా, క్వార్ట్జ్, క్వారీలపై పడి దోపిడీ చేసిన వందలాది మంది వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు చట్టపరమైన చర్యలకు సిద్ధపడాల్సిన సమయం ఆసన్నమైంది. పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం ఈ కేసుల్లో బాధ్యులుగా చట్టం ముందు నిలబడాల్సి వస్తున్నది. సీఎం చంద్రబాబు త్వరలో గనుల శాఖలో జరిగిన దోపిడీపై విడుదల చేయబోయే శ్వేతపత్రంతో అక్రమార్కుల అరెస్టుపర్వం ప్రారంభంకానుంది. జిల్లా అధికారులు ఇప్పటికే ఇచ్చిన నివేదిక ప్రకారం చిన్నాపెద్దా అంతా కలిపి సుమారు 200 మంది వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

● అక్రమ రవాణాలో అగ్రనేతల పేర్లు?

చివరి ఏడాదిన్నరకాలం పాటు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ నిరాటంకంగా సాగిన విషయం తెలిసిందే. ఈ దోపిడీపై జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా నివేదిక పంపారు. ఇందులో సుమారు 200 మందికి పైగా వైసీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ దోపిడీలో వైసీపీ ముఖ్య నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలపై పెద్ద ఎత్తున ఆరోపణలు, అభియోగాలు వెల్లువెత్తాయి. సజ్జల సూచన మేరకు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ మొదలైందని, అధిష్ఠానం అనుమతితో అనిల్‌కుమార్ దాన్ని గంపగుత్తగా కైవసం చేసుకున్నారని, సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి కాకాణి ప్రభుత్వ భూముల్లోని క్వార్ట్జ్ నిక్షేపాలను కొల్లగొట్టారని అప్పట్లోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. నిజమైన లీజుదారులను సైతం క్వారీల్లోకి రానీయకుండా దౌర్జన్యంగా కైవసం చేసుకున్నారని, క్వార్ట్జ్ దోపిడీపై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. ఆ క్రమంలోనే విచారణ జరిపి లక్షల టన్నుల క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిగాయని అధికారులు నివేదిక పంపారు. ప్రస్తుతం ఆ నివేదిక సీఎం చంద్రబాబుకు దృష్టికి వెళ్లింది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఐదేళ్లపాటు సాగిన సిలికా దోపిడీపై కూడా సీఎం దృష్టి సారించారు. గూడూరు డివిజన్ పరిధిలో 4500 ఎకరాల్లో సిలికా రీచ్‌లు ఉన్నాయి. 80 మంది లీజుదారులు ఉన్నారు. వైసీపీ నాయకులు ఈ లీజుదారందరిని నట్టేట ముంచారు. అధికార బలంతో వీరందరి లీజులను బలవతంగా స్వాధీనం చేసుకున్నారు. అది చాలదన్నట్లు సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న సిలికాను దోచుకున్నారు. ఐదేళ్ల పాటు అడ్డూఅదుపు లేకుండా అధికారమే అండగా సాగిన ఈ దోపిడీపై కూడా చంద్రబాబు దృష్టి సారించారు. గూడూరు డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఈ కేసులో బాధ్యులుగా గుర్తించబడ్డారు. సోమవారం సీఎం చంద్రబాబు గనుల శాఖపై నిర్వహించిన సమీక్షలో నెల్లూరు జిల్లా కేంద్రంగా జరిగిన క్వార్ట్జ్, సిలికా దోపిడీపై సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. అగ్రనాయకుల ప్రాపకం కోసం దగ్గరుండి కొండలు, గుట్టలు కొల్లగొట్టిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు అందుకు తగిన మూల్యం చెల్లించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కేసులో పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి.

స్టాక్ పాయింట్ నుంచి ఇసుక సరఫరా ప్రారంభం




ఇసుక సరఫరాను జెండా ఊపి ప్రారంభిస్తు ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దొరవారిసత్రం మండలం నేతాజీనగర్ వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ నుండి మంగళవారం ఇసుక విక్రయాలు ప్రారంభమయాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాయింట్ వద్ద సరఫరాను ప్రారంభించారు. తగ్గించిన ధరలతో ఇసుకను వినియోగదారులకు అందించేలా చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీతో ఈ పాయింట్ వద్ద ఇసుక టన్ను రూ.465 నిర్ణయించినట్లు తెలిపారు. తగ్గిన ధరలు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరమన్నారు. త్వరలో కొత్త పాలసీ కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాగా అధికారులు ఇసుకను కొనుగోలుదారుల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ చేసుకొంటూ, వే బిల్లును మ్యాన్‌వల్‌గా ఇస్తున్నారు. ఒక ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నుల ఇసుక ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు సంచి విజయ్ కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉదయ్‌కుమార్, ఏజీ కిషోర్, ఆర్డీవో మునిచంద్ర, తహసీల్దారు గోపినాథరెడ్డి, గనుల శాఖ ఆర్ఐ మురళి, ఎస్ఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్లాస్టిక్ ముప్పు

సూళ్లూరుపేటలో రోజురోజుకూ పెరుగుతున్న వినియోగం




తపాలా కార్యాలయ సమీపంలో రోడ్డుపై ప్లాస్టిక్ కవర్లు - డంపింగ్ యార్డులో ఇదే పరిస్థితి

సూళ్లూరుపేట, జూలై 9: సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్ రాక్షసి నుంచి సూళ్లూరుపేట పట్టణాన్ని బయటపడేసే మార్గాల పై మున్సిపాలిటీ దృష్టి సారించడం లేదు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తూతూమంత్రంగా దాడులు చేసి అపరాధ రుసుములకే పరిమితమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్ది శాశ్వత పరిష్కార దిశగా అధికారులు అడుగులు ముందుకు వేయడం లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం సూళ్లూరుపేటకు వేలాది మంది వచ్చిపోతుంటారు. కూరగాయలు, చిన్నపాటి వస్తువులు కొనుగోలు చేసిన ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం ఫ్యాషన్‌గా మారింది. చివరికి టీ కూడా ప్లాస్టిక్ కవర్లలో పార్శిల్ తీసుకెళ్లడం పరిపాటిగా మారిపోయింది.

నిషేధం ఉన్నా..

కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు 1 జూలై 2022 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించారు. ఆ తర్వాత దశల వారీగా అన్నింటిని నిషేదిస్తూ రావాలన్నది కేంద్రం ఉద్దేశం.

విచ్చలవిడిగా విక్రయాలు..

నిషేధిత జాబితాలో ప్లాస్టిక్‌తో ఇయర్ బర్డ్స్, బెలూన్స్, జెండాలు, క్యాండీ, ఐస్‌క్రీం పుల్లలు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్ ఉన్నాయి. జనవరి 2023 నుంచి 120 మైక్రాన్ల మందం కలిగిన కవర్లు, 100 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్, పీవీసీ బ్యానర్లు, సిగరెట్ ప్యాకెట్లు, ఆహ్వాన పత్రికలు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, స్పూన్లు, కత్తులను నిషేధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీదారులు, దిగుమతి చేసుకొనే వారు పట్టుబడితే మొదటి సారి రూ.50 వేలు, రెండోసారి రూ.లక్ష, పెద్ద గోదాముల్లో నిల్వచేసే వారికి మొదటి సారి రూ.25 వేలు, రెండో సారి రూ.50 వేలు, వస్తువులను విక్రయిస్తే మొదటిసారి రూ.20 వేలు, రెండో సారి రూ.40 వేలు, రవాణా చేసినందుకు ఎన్‌ఫోర్సుమెంట్, కమర్షియల్ విభాగం ఆధ్వర్యంలో రూ.25వేలు ఆ తర్వాత రూ.50 వేలు జరిమానా విధించాలని నిబంధనలు చెబుతున్నాయి.

ప్రమాద ఘంటికలు..

సూళ్లూరుపేట పట్టణంలోని కిరణా దుకాణాలు, టీ స్టాల్స్, కూరగాయల మార్కెట్, సూపర్ మార్కెట్లు, హోల్‌సేల్ దుకాణాలు, పూల వ్యాపారులు పెద్ద పెద్ద ప్లాస్టిక్ కవర్లలో సరుకులు అందిస్తున్నారు. మద్యం, శీతల పానీయాల దుకాణాల వద్ద కూడా ప్లాస్టిక్‌ను వాడి పడేస్తున్నారు. ఫంక్షన్ హాళ్ల వద్ద ప్లాస్టిక్ బాటిళ్లను రోడ్లపై పడేస్తుండడంతో అవి కాస్తా గాలికి కాలువల్లో చేరి మురుగు కదలని పరిస్థితి. ఇలా పట్టణంలో వాడేసిన ప్లాస్టిక్ అంతా డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. అక్కడ ఆవులు, పందులు వాటిని తిని అనారోగ్యం బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, పాలకులు దీనిపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ప్లాస్టిక్ ముప్పు నుంచి విముక్తి కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం



నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న నాయకులు

పెళ్లకూరు, జూలై 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ధ్వంసమైందని, ఏపీని తిరిగి అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం పెళ్లకూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నామినేటెడ్ పదువుల్లో మొదటి ప్రాధాన్యమి స్తామన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ... తన గెలుపునకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నెలవల సుబ్రహ్మణ్యం బాధ్యతలు తీసుకున్న తరువాత నాయకులను సమన్వయం చేసుకుని 22 వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయశ్రీని గెలి పించుకున్నామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డితో కలసి చిల్లకూరుకు చేరుకున్న వారికి నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి పెళ్లకూరు చేరుకున్నారు. డి.ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, గోపాల్‌రెడ్డి, ఎన్.ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, రామచంద్రారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

తడ, జూలై 9: ఈ నెల 12వ తేదీ శుక్రవారం 12వ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన చెప్పారు. ఆ సమావేశంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు తదితరాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్‌మెంబర్లు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

డక్కిలి, జూలై 9: మండలంలోని వెలుగు కార్యాలయ పరిధిలో గ్రామ సంఘాల్లో సంఘ సభ్యులకు తెలియకుండా నిధులు స్వాహ చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి.మునెయ్య డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం ఆయన ఎంపీడీవో లీలామాధురి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ చౌడయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘాల్లో పొదుపు మహిళలకు సంబంధించి బ్యాంకు లింకేజీలు ద్వారా జమ అయిన నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగమైనట్టు గతంలో తాను డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేయగా కమిటీని నియమించి విచారణ జరిపించారని చెప్పారు. సంఘాల్లో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్టు ఆ కమిటీ గుర్తించి వెలుగు సిబ్బందికి నోటీసులు జారీ చేసిందే తప్ప వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ నిరసన



బిందెలతో నిరసన తెలియజేస్తున్న బీడీకాలనీ మహిళలు

నాయుడుపేట టౌన్, జూలై 9: తాగునీటి సమస్య తీర్చాలంటూ బీడీకాలనీ మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. ఆరు నెలలుగా కాలనీలో తాగునీరు సరఫరా కావడం లేదని అరకొరగా ట్యాంకర్ ద్వారా పంపిణీ చేస్తున్నారన్నారు. అయితే ఆ నీరు కూడా బురదగా ఉండటంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ ద్వారా ఇంటికి ఒక్క బిందె మాత్రమే వస్తున్నాయని దీంతో అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు తాగునీరు కాలనీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం బిందెలతో నాయుడుపేట - వెంకటగిరి రహదారికి అడ్డంగా నిరసన తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మహిళలకు నచ్చచెప్పి ఆందోళలను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

● ఎమ్మెల్యే విజయశ్రీ ఆదేశం



మొక్క నాటుతున్న విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 9: మండలాన్ని అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ కోరారు. మంగళవారం పెళ్లకూరు ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... శాఖాపరంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన సమగ్ర ప్రణాళికలు సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే తాను నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితులోనూ అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలాభివృద్ధికి ఎమ్మెల్యేతో కలసి పని చేస్తామని ఎంపీపీ పోలంరెడ్డి, జడ్పీటీసీ ఎన్.ప్రిస్కిల్లా చెప్పారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్‌నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, నాయకులు పి.రమేష్‌నాయుడు, మధునాయుడు, కె.శివకుమార్, నాగేంద్రప్రసాదరెడ్డి, చైతన్య కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ

నాయుడుపేట టౌన్, జూలై 9: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కన్వీనర్ సన్నీ మాట్లాడుతూ... 76 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సంఘం ఏబీవీపీ అని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలు నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టి.చెందు, హరి, నారాయణ, వినయ్, భరత్, ప్రణయ్, బాలాజీ తదితరులు ర్యాలీని పర్యవేక్షించారు.

27 ఎర్రచందనం దుంగల స్వాధీనం



తడ, జూలై 9: మండలంలోని భీమునివారిపాళెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు 27 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా చెక్‌పోస్టు వద్ద మాటు వేసి ఉండడగా అటుగా వచ్చిన లగేజీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. అందులో ఎర్రచందనం దుంగలు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడినుంచి రవాణా చేస్తున్నారన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.